

బిల్లులు.. భోంచేశారు!



బిల్లు చేస్తున్నారు.. మళ్లీ.. మళ్లీ..
ఇది బత్తలపల్లి మండలంలోని నల్లబోయినపల్లి వద్ద తీసిన క్యాటిల్ పాండ్. దీనిని గతంలోనే కొన్నేళ్ల క్రితం తవ్వారు. అప్పట్లో బిల్లు కూడా చేసుకున్నారు. దీనికి ఇటీవల కొన్ని నెలల క్రితం మళ్లీ బిల్లు చేసుకున్నారు. కొత్తగా తవ్వినట్లు చూపుతూ.. ఏకంగా రూ.2 లక్షల నిధులు కాజేశారు. గత ఐదేళ్లలో ఈ పనికి పదేపదే బిల్లులు చేస్తూనే ఉన్నారు..



ఇది బత్తలపల్లి మండలం కోడేకండ్ల గ్రామ సమీపంలో తీసిన ఫీడర్ చానల్. దీనిని గతంలోనే తవ్వారు. కొన్ని నెలల క్రితం తవ్వినట్లు మళ్లీ బిల్లు చేసుకున్నారు. ఆ విషయం ఫొటోలో స్పష్టంగా కనిపిస్తోంది. గతంలోనే తవ్విన ఫీడర్ చానల్ మధ్యలో కొత్తగా తీసినట్లు కాస్త కలరింగ్ ఇచ్చారు. బిల్లు పూర్తిస్థాయిలో చేసుకుని భోంచేశారు.

ఉపాధి హామీ పథకంలో మాయలు

పాత పనులనే కొత్తగా చేసినట్లు కలరింగ్

పెద్దఎత్తున నిధులు స్వాహా

అక్రమాలు బయటపడకుండా ఉన్నతాధికారులకు ఆమ్యామ్యాలు?

బత్తలపల్లి, ఆగస్టు 8: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలు అన్నీఇన్నీ కావు. మండలంలో అవినీతికి అడ్డాగా మార్చేశారన్న ఆరోపణలు మూటగట్టుకుంటున్నారు. గతంలో చేసిన పనులను తాజాగా చేసినట్లు చూపుతూ బిల్లులు బొక్కేస్తున్నారు. రాజకీయ నాయకులు, ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధుల కుటుంబీకులు పనులు చేసినట్లు చూపుతూ నిధులు కాజేస్తున్నారు. రూ.లక్షల్లో ప్రజాధనం లూటీ చేశారు. అక్రమాలు బయటపడకుండా ఉన్నతాధికారులకు సైతం మామూళ్లు ముట్టజెబుతున్నట్లు ఆరోపణలున్నాయి. సామాజిక తనిఖీ బృందానికి సైతం ఆమ్యామ్యాలు ఇచ్చుకున్నట్లు ఆ శాఖలో జోరుగా చర్చ సాగుతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు మేల్కొని, అక్రమాల గుట్టు రట్టు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బిల్లులు మళ్లీ.. మళ్లీ..

ఉన్న ఊరిలోనే పనులు కల్పించడం ద్వారా వలసలను నివారించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. బత్తలపల్లి మండలంలో అధికారులు, రాజకీయ నాయకులు కలిసి ఈ పథకం లక్ష్యానికి తూట్లు పొడిచారు. అక్రమ మార్గాల్లో లక్షల రూపాయల ప్రజాధనాన్ని దోచేస్తున్నారు. పనికోరేటు నిర్ణయించి, అవినీతి దందాకు తెరలేపుతున్నారు. ఐదేళ్లుగా చేసిన పనులకే మరోసారి బిల్లులు చేసుకుంటూ రూ.లక్షల్లో అక్రమాలకు పాల్పడ్డారు. సామాజిక తనిఖీ తూతూమంత్రంగా ముగుస్తోందే తప్ప.. అవినీతిని తేటతెల్లం చేయలేదు. సామాజిక తనిఖీ బృందానికి కూడా ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు లేకపోలేదు. మండలవ్యాప్తంగా ఇదే తంతు నడుస్తున్నా.. అధికారులు ఆమ్యామ్యాలు పుచ్చుకుని, మిన్నకుండిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. బత్తలపల్లి మండలంలో అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల కుటుంబీకులు, రాజకీయ నాయకులు, గ్రామాలు వదిలి ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారిని ఉపాధి కూలీలుగా చేర్చారు. వారు పనులు చేసినట్లు మస్టర్లలో నమోదు చేసి, బిల్లులు కాజేస్తున్నారు.

ఐదేళ్లుగా అవే పనులు

మండలంలో ఉపాధి హామీ పథకం కింద ఐదేళ్లలో చేసిన పనులకే మళ్లీ మళ్లీ బిల్లులు దోచేశారు. ఒక్కో క్యాటిల్ పాండ్, ఫిష్ పాండ్‌కు రూ.50వేలు ఎఫ్‌ఏ నుంచి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. గతంలో చేసిన పనులనే తాజాగా పైపైన చేసి, కొత్తగా చేసినట్లు చూపుతున్నారు. బిల్లులు కాజేస్తున్నారు. ముద్దనపల్లికి చెందిన అంగన్‌వాడీ ఉద్యోగులు లక్ష్మి, గౌరి ఉపాధి హామీ పనులకు వెళ్లినట్లు మస్టర్లలో నమోదు చేసి, బిల్లులు చెల్లించారు. కూలీల జాబితాలో చాలామంది గ్రామాల్లోలేని వారి పేర్లను నమోదు చేసినట్లు తెలుస్తోంది. వారు పనిచేసినట్లు డబ్బు డ్రా చేసినట్లు రికార్డులు చెబుతున్నాయని స్థానికులు ఆరోపించారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ఉపాధి హామీ పథకంలో అక్రమాల ఆరోపణలపై విచారిస్తాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం.
- శివనాగప్రసాద్, ఎంపీడీఓ, బత్తలపల్లి



అనధికార ఫీల్డ్ అసిస్టెంట్..

మండలంలోని నల్లబోయనపల్లి పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్(ఎఫ్‌ఏ)గా లోకేశ్వరరెడ్డి పనిచేస్తున్నారు. అనధికారికంగా రాప్తాడు మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే హెచ్‌ఎం భర్త ఎఫ్‌ఏగా వ్యవహరిస్తున్నారు. ఎంపీడీఓ, ఏపీఓ, ఈసీ అడ్డు చెప్పకపోగా.. పూర్తిగా సహకారం అందిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈయన ఎఫ్‌ఏలకు నేతృత్వం వహిస్తూ.. అధికారులకు మామూళ్లు వసూలు చేసి, ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి.

బఫర్.. ఫీవర్..!

జిల్లాలో 2.3 లక్షల కిలోల బియ్యం బఫరట..!

బొక్కేసిన గత వైసీపీ డీలర్లు

ఆగస్టు కోటా బియ్యంలో భారీగా కోతలు

కొత్త డీలర్లకు సంకటం

కొత్తచెరువు/పుట్టపర్తి రూరల్, ఆగస్టు 8: కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఆ పార్టీల మద్దతుదారులు రేషన్ దుకాణాల నిర్వహణను చేజిక్కించుకున్నారు. ఆనందంగా దుకాణాల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఆ ఆనందం వారికి ఎంతోసేపు నిలువలేదు. వారికి బఫర్ బెంగ పట్టుకుంది. ఇటీవలి వరకు దుకాణాలు నిర్వహించిన వైసీపీ మద్దతుదారులు బియ్యం బొక్కేసి, బఫర్ చూపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కొత్తగా దుకాణాల నిర్వహణ చేపట్టిన కూటమి మద్దతుదారులకు తొలి నెలలోనే బియ్యంలో అధికారులు పెద్దఎత్తున కోత పెట్టారు. దీంతో వారు అయోమయంలో పడ్డారు.

పెద్ద ఎత్తున బఫర్

సాధారణంగా రేషన్ దుకాణాలను అధికార పార్టీ మద్దతుదారులు నిర్వహిస్తుంటారు. ఈ తరుణంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లావ్యాప్తంగా రేషన్ డీలర్లు మారారు. కూటమి పార్టీల మద్దతుదారులు దక్కించుకున్నారు. మొదటి నెలలోనే బఫర్ స్టాక్ అధిక మొత్తంలో ఉండటంతో వారి కళ్లు బైర్లుకమ్మాయి. ఆగస్టులో పంపిణీ చేయాల్సిన కోటాలో భారీగా కోతలు పడటంతో నూతన డీలర్లు తక్కువగా వచ్చిన బియ్యాన్ని ఎవరికి పంపిణీ చేయాలో అర్థంకాక లబోదిబోమంటున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో మొత్తం 1360 రేషన్ షాపులున్నాయి. ఇందులో 2.3 లక్షల కేజీల బఫర్ ఉందంటే గతంలో డీలర్లు పేదలకు వచ్చే బియ్యాన్ని ఎంతమేర బొక్కారో అర్థం అవుతోంది. పుట్టపర్తి మండలంలో మొత్తం 40 రేషన్‌షాపులు ఉండగా.. వీటి పరిధిలో 18,500 మంది కార్డుదారులున్నారు. వీరికి ప్రతినెలా 2878.24 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేస్తారు. ఆగస్టులో 322.24 క్వింటాళ్లు బఫర్‌పోను 2556 క్వింటాళ్లు, కొత్తచెరువు మండలవ్యాప్తంగా 38 రేషన్‌షాపులు ఉండగా... ఇందులో 12,998 మంది కార్డుదారులున్నారు. వీరికి ప్రతినెలా 2127.24 క్వింటాళ్ల బియ్యం సరఫరా అవుతోంది. ఆగస్టులో 38 దుకాణాలకుగాను 309 క్వింటాళ్ల బఫర్ ఉంది. ఈనెల బఫర్‌పోను 1818.24 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేసినట్లు పౌరసరఫరాల శాఖాధికారులు చెబుతున్నారు. కొత్త డీలర్లు ఈ బఫర్ కొరతను ఎలా భర్తీ చేసుకోవాలో అర్థం కాక జుట్టు పీక్కుంటున్నారు. మునుపటి డీలర్ల నుంచి బఫర్ స్టాకును రికవరీ చేస్తామని అధికారులు చెబుతున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో నూతన డీలర్లకు తిప్పలు తప్పడంలేదు.



చౌకధాన్యపు దుకాణంలో బియ్యం పంపిణీ

పర్యవేక్షణలోపమే కారణమా?

గత వైసీపీ పాలనలో కొంతమంది పౌరసరఫరాల శాఖాధికారులు రేషన్ దుకాణ డీలర్లతో కుమ్మక్కై, పేదలకు అందాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టించారన్న ఆరోపణలున్నాయి. కొంతమంది వైసీపీ నాయకులు కర్ణాటకకు రేషన్ బియ్యాన్ని తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డ ఘటనలు కోకొల్లలు. ప్రతి మండలానికి ఒక సీఎస్‌డీటీ ఉంటారు. మండలంలోని చౌకధరల దుకాణాలను పర్యవేక్షిస్తుంటారు. ప్రజలకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందిస్తున్నారా, లేదా అని పర్యవేక్షించాల్సి ఉంటుంది. రేషన్ దుకాణాలకు ప్రతినెలా స్టాక్‌పాయింట్ నుంచి ఎన్ని క్వింటాళ్ల బియ్యం వస్తోంది, ఎంత బఫర్ ఉంది అని చూడాల్సి ఉంది. సీఎస్‌డీటీలు పర్యవేక్షణ మరువడంతో డీలర్లు మిగులు బియ్యాన్ని బయట మార్కెట్‌కు తరలించి, సొమ్ము చేసుకున్నట్లు విమర్శలున్నాయి. మరికొంతమంది డీలర్లు.. పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లకు మామూళ్లు ముట్టచెబుతూ బియ్యాన్ని పక్కదారి పట్టించారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో జిల్లావ్యాప్తంగా నూతన డీలర్లకు బఫర్ ఫీవర్ పట్టుకుంది.

రికవరీ చేస్తాం: వంశీకృష్ణారెడ్డి, డీఎస్‌ఓ

జిల్లావ్యాప్తంగా 2.30 లక్షల కేజీలు బఫర్ ఉంది. ఇప్పటికే మండలాల్లోని సీఎస్‌డీటీలనుంచి ఏమండంలో ఎంత బఫర్ ఉన్నది నివేదికలు కోరాం. రికవరీకి చర్యలు ప్రారంభించాం.99

అంతా ఏకగ్రీవం..!

ప్రశాంతంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

కోరంలేక పది స్కూళ్లలో వాయిదా

బత్తలపల్లిలో రసాభాస



బత్తలపల్లిలో ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

కొత్తచెరువు/బత్తలపల్లి, ఆగస్టు 8: జిల్లావ్యాప్తంగా పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. గురువారం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలో మొత్తం 2065 పాఠశాలలు ఉండగా.. పదిచోట్ల కోరంలేక జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పది పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించలేదని డీఈఓ మీనాక్షి తెలిపారు. పుట్టపర్తి మండలం పెడబల్లిలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికలకు ఆమె పరిశీలకురాలిగా వ్యవహరించారు. ఎన్నికైన ఛైర్మన్, వైస్‌ఛైర్మన్, కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో విద్యాశాఖ అధికారులు ఎన్నికలు నిర్వహించారు. బత్తలపల్లి గురుకుల పాఠశాలలో గొడవ తలెత్తడంతో వాయిదా వేశారు. జిల్లాలోని 2055 పాఠశాలల్లో కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను ఎన్నుకున్నారు. ఎన్నికైన పాఠశాలల్లో ఛైర్మన్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సీఎంఓ అబ్దుల్ మాలిక్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పెడబల్లి ఉన్నత పాఠశాల కమిటీ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న డీఈఓ

బత్తలపల్లిలో ఘర్షణ

ధర్మవరం మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను బత్తలపల్లిలో నిర్వహిస్తున్నారు. పాఠశాల అభివృద్ధి కమిటీ ఎన్నికల్లో ఘర్షణ తలెత్తింది. టీడీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి వర్గం ఉదయం గురుకుల పాఠశాలకు నామినేషన్ వేసేందుకు వెళ్లింది. విద్యార్థుల తల్లిదండ్రులు తక్కువగా వచ్చారని తెలియడంతో పాఠశాల బయట వేచి ఉన్నారు. అంతలో వైసీపీకి చెందిన తాజా, మాజీ కమిటీ ఛైర్మన్ చంద్ర నామినేషన్ వేసేందుకు వచ్చారు. దీంతో టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. వైసీపీ వ్యక్తి ఎలా నామినేషన్ వేస్తారని అడ్డుచెప్పారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం తలెత్తింది. బాహాబాహీకి దిగారు. సీఐ ఆరోహణరావు, ఎస్‌ఐ శ్రీనివాసులు కలుగజేసుకుని, ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. తరువాత 5గంటలకు ఎంఈఓ గోపాల్‌నాయక్ మాట్లాడుతూ.. కోరం లేనందున ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తదుపరి పోలింగ్ తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

షాపులో పనిచేస్తూనే చోరీకి స్కెచ్

- కదిరిలో చోరీ కేసు ఛేదింపు
- నలుగురి అరెస్టు
- రూ.10.30 లక్షల నగదు, వెండి వస్తువుల స్వాధీనం

కదిరి, ఆగస్టు 8: షాపులో ఏళ్లుగా పనిచేస్తున్న నమ్మకస్తుడే యజమాని ఇంట్లో చోరీకి స్కెచ్ వేశాడు. స్నేహితులతో కలిసి చోరీ చేసి, పోలీసులకు దొరికిపోయి కటకటాలపాలయ్యాడు. పట్టణంలోని మదనపల్లి రహదారిలోని యామినీ మెడికల్ స్టోర్ యజమాని ఇంట్లో చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఆ వివరాలను కదిరి పట్టణ పోలీసు స్టేషన్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ రత్న వెల్లడించారు. పట్టణానికి చెందిన మధుసూదన్ మదనపల్లి రహదారిలో యామినీ వెటర్నరీ మెడికల్ స్టోర్ నిర్వహిస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో షాపు, మొదటి అంతస్తులో ఆయన ఇల్లు ఉంది. పట్టణంలోని నిజాంవలీ కాలనీకి చెందిన షేక్ హైదర్‌వలీ షాపులో పదేళ్లుగా పని చేస్తుండేవాడు. వ్యసనాలకు బానిసయ్యాడు. వాటిని తీర్చుకునేందుకు అప్పులు చేశాడు. ఈ నేపథ్యంలో ఈనెల 5న మెడికల్ షాపు నిర్వాహకుడు మధుసూదన్ రూ.11.30 లక్షల నగును ఇంట్లోని బీరువాలో ఉంచి అదేరోజు బెంగళూరు వెళ్లారు. విషయం భార్య కల్యాణికి చెప్పారు. విషయం తెలుసుకున్న హైదర్‌వలీ ఆ డబ్బు కొట్టేయాలని పథకం పన్నాడు. అందులో భాగంగా నిజాంవలీ కాలనీకి చెందిన మిత్రులు షేక్ అల్తాఫ్, కేదారి మహేష్‌తో కలిసి స్కెచ్ వేశాడు. ఐదో తేదీ మధ్యాహ్నం మెడికల్ షాపులో మధుసూదన్ భార్య కల్యాణి, హైదర్‌వలీ ఉన్నారు. కల్యాణి కంటపడకుండా అల్తాఫ్, మహేష్ వారి ఇంట్లోకి చొరబడేలా హైదర్‌వలీ సూచనలిచ్చాడు. వారు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉంచిన నగదు, 1.34 కిలోల వెండి వస్తువులను అపహరించుకుని వెళ్లిపోయారు. చోరీ చేసిన సొమ్ము నిజాంవలీ కాలనీకే చెందిన ఖాజాపీరా వద్ద ఉంచారు. షాపు యజమాని మధుసూదన్ 5వతేదీ అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఇంటికి చేరుకున్నారు. 6న ఉదయమే బీరువాలో డబ్బు చూసుకోవడానికి తెరిచారు. బీరువాలో డబ్బు కనిపించకపోవడంతో భార్యను అడిగారు. ఆమె తెలియదని చెప్పడంతో బీరువాను క్షుణ్ణంగా పరిశీలించారు. బీరువాలోని నగదుతోపాటు వెండి వస్తువులు కూడా చోరీ అయినట్లు గుర్తించారు. బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ శ్రీలత.. పట్టణ సీఐ పుల్లయ్య, ఎస్‌ఐ బాబ్‌జాన్‌తో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. రెండు బృందాలుగా విడిపోయి, దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ముగ్గురు వ్యక్తులు చోరీ చేసినట్లు నిర్ధారణకు వచ్చారు. గురువారం స్థానిక నేహా ఫంక్షన్‌హాల్ సమీపంలో వారిని అరెస్టు చేశారు. వారితోపాటు ఖాజాపీరా కూడా అక్కడే ఉండడంతో నలుగురినీ అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10.30 లక్షల నగదు, 1.34 కిలోల వెండి వస్తువులు, మొబైల్ ఫోన్‌స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.12లక్షలు ఉంటుందని ఎస్పీ వెల్లడించారు. కేసును ఛేదించిన పట్టణ సీఐ పుల్లయ్య, ఎస్‌ఐలు బాబ్‌జాన్, బలరామయ్య, సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ విక్టర్, కానిస్టేబుల్ రామాంజులు, హరినాథ్‌రెడ్డి, నాగరాజు, శివశంకర్‌రెడ్డి, రాజప్పను ఎస్పీ అభినందించారు. రివార్డులు ప్రకటించారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పనులు కల్పించండి..

భవన నిర్మాణ కార్మికుల డిమాండ్

ధర్మవరంలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ధర్మవరం రూరల్, ఆగస్టు 8: తాపీమేస్త్రీలుగా జీవనం సాగిస్తున్న తమకు వెంటనే భవన నిర్మాణ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ధర్మవరంలోని ప్రధాన కూడళ్ల గుండా కార్మికులు బైక్ ర్యాలీ చేపట్టారు. ఆ సంఘం నేత నాగరాజు మాట్లాడుతూ.. ఏళ్లుగా తాము తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. స్థానికేతరులు వచ్చి తమకు పనులు లేకుండా చేస్తున్నారన్నారు. దీంతో జీవనాధారం కోల్పోతున్నామన్నారు. ప్రభుత్వ భవనాల పనులు చేసుకునేలా అవకాశం కల్పించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలనీ, బీమా వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాపీ మేస్త్రీ సంఘం కార్మికులు ఆదెప్ప, రేగాటిపల్లి నారాయణస్వామి, శ్రీరాములు, ఆదినారాయణ, ఆంజనేయులు, కొండా, శంకర్, గోవింద్, మేస్త్రీ వారాధి, రాధా, నరసింహులు పాల్గొన్నారు.

పిల్లల కోసం తల్లిదండ్రుల ఘర్షణ

దంపతులకు గాయాలు



చిన్నారి ధృవ చెంపపై దెబ్బ

గోరంట్ల, ఆగస్టు 8: మండలంలోని పాలసముద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఇద్దరు యూకేజీ చిన్నారుల మధ్య తలెత్తిన గొడవ వారి తల్లిదండ్రుల మధ్య ఘర్షణకు దారితీసింది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పుల్లగూర్లపల్లికి చెందిన మంజునాథ్, శ్రీదేవి దంపతుల కుమారుడు ధృవ పాలసముద్రంలోని ప్రైవేటు పాఠశాలలో యూకేజీ చదువుతున్నాడు. పాలసముద్రం గ్రామానికి చెందిన నాగభూషణరెడ్డి కుమారుడు కూడా అదే తరగతిలో ఉన్నాడు. ఇరువురు చిన్నారులు గురువారం గొడవపడ్డారు. ధృవ తనను కొట్టినట్లు నాగభూషణరెడ్డికి అతడి కుమారుడు చెప్పాడు. దీంతో ఆగ్రహించిన నాగభూషణరెడ్డి పాఠశాలకు వెళ్లి చిన్నారి ధృవపై చేయిచేసుకున్నాడు. దెబ్బలు తిన్న ధృవ వెంటనే గ్రామానికెళ్లి తల్లిదండ్రులకు విషయం చెప్పాడు. కుమారుడి చెంపపై దెబ్బలు పడిన ఆనవాళ్లు ఉండడంతో తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వచ్చి, నిర్వాహకులపై మండిపడ్డారు. పాఠశాల నిర్వాహకులు.. నాగభూషణరెడ్డిని పిలిపించారు. ఆ సమయంలో చిన్నారుల తల్లిదండ్రుల మధ్య వాగ్వాదం తలెత్తింది. ఆగ్రహం చెందిన నాగభూషణరెడ్డి పక్కనే ఉన్న ఇనుప రాడ్‌తో దంపతులపై దాడి చేశాడు. దీంతో మంజునాథ్ ఎడమచేయి విరగడంతోపాటు గాయాలయ్యాయి. శ్రీదేవి స్వల్పంగా గాయపడింది. గోరంట్ల ఆస్పత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం మంజునాథ్‌ను హిందూపురం తరలించారు. ఘర్షణపై గోరంట్ల పోలీసులు విచారిస్తున్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ చేతన్, డీఈఓ మీనాక్షి

మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలి

ఎకో క్లబ్‌లు, న్యూట్రిషన్ గార్డెన్స్ ఏర్పాటు చేయాలి.. జిల్లా కలెక్టర్ చేతన్ ఆదేశాలు

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 8: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని నాణ్యంగా అందించాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్.. ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. మండలంలోని పెడబల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మెనూప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలోని న్యూట్రిషన్ గార్డెన్లను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఎకో క్లబ్‌లు, న్యూట్రిషన్ గార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి, హెచ్‌ఎం రమామణి, టీచర్లు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో భారీ వర్షం

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 8: జిల్లాకేంద్రంలో గురువారం భారీ వర్షం కురిసింది. పట్టణంలోని రహదారులు జలమయమయ్యాయి. పట్టణవాసులు చల్లటి వాతావరణంలో సేదతీరారు. జిల్లాలోని పెనుకొండ, కొత్తచెరువు, ముదిగుబ్బలో మోస్తరు వర్షం కురిసింది.



జిల్లాకేంద్రంలో జలమయమైన రోడ్డు

విద్యతోనే సమాజాభివృద్ధి: వీసీ

సెంట్రల్ యూనివర్సిటీ నూతన భవనాలు ప్రారంభం



సెంట్రల్ యూనివర్సిటీ నూతన భవనం ప్రారంభోత్సవంలో పాల్గొన్న వీసీ డాక్టర్ ఎస్ఏ కోరి, ఎమ్మెల్యే బండారు శ్రావణి తదితరులు

బుక్కరాయసముద్రం, ఆగస్టు 8: 'ఆధునిక సమాజాభివృద్ధికి మూలం విద్య. అన్ని వర్గాలకు నాణ్యమైన ఉన్నత విద్య అందినప్పుడే సమాజం సమగ్రాభివృద్ధి చెందుతుంది' అని సెంట్రల్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ ఎస్.ఎ. కోరి అన్నారు. మండల పరిధిలోని జంతులూరు గ్రామం వద్ద నూతనంగా నిర్మించిన సెంట్రల్ యూనివర్సిటీలో నూతనంగా నిర్మించిన విద్యా భవనాలు, సంక్షేమ వసతి గృహాలను గురువారం వీసీ, ఎమ్మెల్యే బండారు శ్రావణి ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ రాష్ట్రానికి విద్యారంగంలో మూలమైన సెంట్రల్ యూనివర్సిటీని అత్యున్నతంగా తీర్చిదిద్దటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం మరువలేనిదన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో తొలి విడతలో రూ.350 కోట్లతో రెండు అకడామిక్ భవనాలు, పరిపాలన భవనం, మూడు విద్యార్థుల హాస్టళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో విద్యార్థులకు సరిపడ భవనాలు లేకపోవడంతో జేఎన్టీయూ క్యాంపస్‌లో ఇంక్యుబేషన్ భవనం, ఓ ప్రైవేటు కళాశాలలో గడిచిన ఆరేళ్లు తరగతులు నిర్వహించామన్నారు. నూతన భవనాలలో ఈ నెల 12 నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నూతనంగా మరిన్ని కోర్సులు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈఏడాది నుంచి 1100 మంది విద్యార్థులకు సరిపడే కోర్సులకు అడ్మిషన్ చేసుకుంటామన్నారు. సెకండ్ ఫేజ్‌లో వచ్చే నిధులతో క్యాంపస్ ప్రాంగణంలో సెంట్రల్ లైబ్రరీ, సిబ్బంది క్వార్టర్స్ , క్రీడా మైదానంతో పాటు మౌలిక సదుపాయాల కల్పన వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

చంద్రబాబు విజన్‌తోనే: బండారు శ్రావణి, ఎమ్మెల్యే

ఎమ్మెల్యే శ్రావణి మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమకు సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలన్న సీఎం చంద్రబాబునాయుడు విజన్‌తోనే నిర్మాణం పూర్తి అయ్యిందన్నారు. కేంద్రంతో పట్టుబట్టి అనంతపురంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం నిర్మాణానికి కృషి చేశారన్నారు. దాదాపు 500 ఎకరాలలో 17 రాష్ట్రాలకు సంబంధించిన విద్యార్థులు ఈ యూనివర్సిటీలో చదువుకునే విధంగా ఏర్పాట్లు ఉన్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం సెంట్రల్ యూనివర్సిటీ అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టిందని మండిపడ్డారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం శింగనమల నియోజకవర్గంలో ఏర్పాటు కావడం గర్వకారణమన్నారు. క్యాంపస్ అభివృద్ధి విషయం సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తామన్నారు. యూనివర్సిటీలో తమ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వీసీని కోరారు. సెంట్రల్ యూనివర్సిటీ సిబ్బంది, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, ఎంపీపీ సునీత, టీడీపీ నేతలు పొడరాళ్ల రవీంద్రా, జీసీ బాబు తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు ఒకరే.. డిప్యూటీకి మాత్రం ఇద్దరు!

డిప్యూటీ డీఈఓ ఆఫీస్‌లో ఇద్దరు సీసీలపై విమర్శలు



డిప్యూటీ డీఈఓ ఆఫీస్‌లో...
సీసీ కుర్చీలో సంబంధం లేని క్లర్క్

అనంతపురం విద్య, ఆగస్టు 8: అనంతపురం జిల్లా డిప్యూటీ డీఈఓ ఆఫీస్ ఇష్టారాజ్యంగా నడుస్తోంది. డిప్యూటీ డీఈఓ ఇద్దరు ఉద్యోగులను సీసీలుగా నియమించుకున్నట్టు విమర్శలు వస్తున్నాయి. డీఈఓకు ఒక సీసీ ఉంటే...డిప్యూటీకి మాత్రం ఇద్దరు ఎందుకంటూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లా డిప్యూటీ డీఈఓ కార్యాలయంలో సీసీగా ప్రస్తుతం మంజీర అనే మహిళా ఉద్యోగి పనిచేస్తున్నారు. అయితే కళ్యాణదుర్గంలోని ఓ హైస్కూల్‌లో పనిచేస్తున్న మస్తాన్‌తో అనంతపురం డిప్యూటీ డీఈఓ కార్యాలయం క్యాంపులో సైతం పనులు చేయిస్తున్నట్టు సమాచారం. క్యాంపుక్లర్కు కూర్చోవాల్సిన సీట్‌లో మస్తాన్ కూర్చొని విధులు నిర్వరిస్తుండటం విస్మయం కలిగిస్తోంది. డివిజన్‌లోని వందలాది ప్రైవేట్ స్కూళ్ళు, ప్రభుత్వ స్కూళ్ల నుంచి డివిజన్ క్యాంపు కార్యాలయానికి వచ్చే కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు సీసీ ఎవరో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ఒకే కార్యాలయంలో ఇద్దరు సీసీలు ఉండటం ఇదెక్కడి విడ్డూరం అంటూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

జీడిపల్లికి చేరిన కృష్ణమ్మ



హంద్రీనీవా కాలువలో
తరలివస్తున్న కృష్ణాజలాలు

బెళుగుప్ప, ఆగస్టు 8: నీటి కోసం అల్లాడుతున్న కరువు జిల్లాకు ఈ ఏడాది 15 రోజులు ముందుగానే కృష్ణమ్మ తరలివచ్చింది. జీడిపల్లి రిజర్వాయరుకు గురువారం కృష్ణా జలాలు వచ్చాయి. గత ఏడాది ఆగస్టు 24న రాగా ఈఏడాది కాస్త ముందుగానే కృష్ణా జలాలు వచ్చి చేరాయి. రాగులపాడు ఎత్తిపోతల పథకం కింద రెండు పంపుల ద్వారా నీటిని వదులుతున్నారు. హంద్రీనీవా అధికారులు, రైతులు కృష్ణమ్మకు స్వాగతం పలికారు.

ఎంవీ రమణకు తుది వీడ్కోలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, శ్రేణుల నివాళి
- కదిలొచ్చిన కమ్యూనిస్టు భావజాల ప్రియులు
- పార్టీలకు అతీతంగా ఘననివాళి
- వైద్య కళాశాలకు భౌతిక కాయం అప్పగింత

అనంతపురం విద్య, ఆగస్టు 8: సీనియర్ సీపీఐ నాయకుడు ఎంవీ రమణకు ఆత్మీయులు, కుటుంబసభ్యులు, సీపీఐ, సీపీఎం శ్రేణులు, కమ్యూనిస్టు భావజాల ప్రియులు, పలు పార్టీల నాయకులు ఘనంగా తుది వీడ్కోలు పలికారు. ఆయన అంతిమ యాత్రను గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంవీ రమణ భౌతికకాయాన్ని ఉదయం ఇంటి నుంచి పార్టీ ఆఫీస్‌కు తీసుకొచ్చి వామపక్ష పార్టీ శ్రేణులు, ప్రజల సందర్శనార్థం ఉంచారు. పార్టీశ్రేణులతో కలిసి సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, సీపీఎం నాయకులు ఓబులతో పాటు ఇతర పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, వైసీపీ నాయకులు, సీపీఎంఎల్, ఎస్‌యూసీఐ, సీపీఎంఎల్ న్యూ డెమోక్రసీ, కడప, నంద్యాల, కర్నూలు, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన పలువురు నాయకులు తరలి వచ్చి నివాళులర్పించారు. ఆయనతో సాన్నిహిత్యం ఉన్న మేధావులు, ప్రజా సంఘాల నాయకులు, జర్నలిస్టులు, సామాన్యప్రజలు సైతం తరలివచ్చిన నివాళులర్పించారు.

వైద్య కళాశాల వరకూ అంతిమయాత్ర...



అనంతపురంలో సాగుతున్న ఎంవీ రమణ అంతిమయాత్ర



భౌతికకాయాన్ని వైద్య కళాశాలకు అప్పగిస్తున్న కుటుంబసభ్యులు

మధ్యాహ్నం 2.30 గంటలకు మొదలైన ఎంవీ రమణ అంతిమయాత్రను 3.30 గంటలకు ప్రభుత్వ వైద్య కళాశాల వరకూ నిర్వహించారు. పార్టీ ఆఫీస్ నుంచి త్రివేణి థియేటర్ సర్కిల్, సూర్యనగర్ రోడ్డు, సప్తగిరి సర్కిల్ మీదుగా వైద్య కళాశాల వరకూ అంతిమయాత్ర సాగింది. సీపీఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ మధ్యలో వచ్చి అంతిమయాత్రలో భాగస్వాములయ్యాయి. ఎంవీ రమణ కుమారుడు వేణుగోపాల్, కోడలు సునీత, మనవడు, మనవరాళ్ల అంగీకారంతో ఆయన భౌతిక కాయాన్ని వైద్య విద్యార్థుల ప్రయోగాల కోసం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యాలరావుకు అప్పగించారు.

ఉన్నత విలువలున్న వ్యక్తి ఎంవీ రమణ: రామకృష్ణ

ఉన్నత ఆశయాలు, విలువలతో జీవించిన మహోన్నత వ్యక్తి ఎంవీ రమణ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. ఎంవీ రమణ భౌతికకాయాన్ని వైద్య కళాశాలకు అప్పగించిన తర్వాత పార్టీ శ్రేణులు ఆయనకు ఘనంగా విప్లవ వందనాలు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి మరణించే వరకూ ఆయన పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా సేవ చేశారన్నారు. ఆయన సిద్ధాంతాలు ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని తెలిపారు. జగదీష్ మాట్లాడుతూ సమాజానికి తన జీవితాన్నే అంకితం చేసిన గొప్ప వ్యక్తి రమణ అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు రామచంద్రయ్య, నాయకులు కర్నూలు జిల్లా నాయకులు భీమలింగప్ప, నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, నబీరసూల్, రాధాకృష్ణ, కడప జిల్లా కార్యదర్శి గాలి చంద్రా, కడప నాయకులు రామయ్య, నాగసుబ్బారెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి లెనిన్‌బాబు, ఉమ్మడి అనంతపురం జిల్లా నేతలు నారాయణస్వామి, మల్లికార్జున, సంజీవప్ప, రాజారెడ్డి, రమణయ్య లింగమయ్య, శ్రీరాములు, గోవింద్, రామకృష్ణ, గోపాల్, కేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మా కుటుంబానికి ఎంతో అనుబంధం: పరిటాల శ్రీరామ్

ధర్మవరం రూరల్: సీపీఐ సీనియర్ నాయకులు ఎంవీ రమణ మృతి ఉమ్మడి జిల్లా ప్రజలకు తీరని లోటని ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. మృతి విషయం తెలుసుకున్న శ్రీరామ్ గురువారం అనంతపురంలోని ఎంవీ రమణ ఇంటికి వెళ్లి ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో పేదల పక్షాన అనేక పోరాటాలు చేసిన గొప్ప నాయకుడు రమణ అని కొనియాడారు. వ్యక్తిగతంగా ఆయనతో తమ కుటుంబానికి ఎంతో అనుబంధం ఉందని శ్రీరామ్ అన్నారు. తన తాత పరిటాల శ్రీరాములు, నాన్న పరిటాల రవీంద్రతో ఆయనకు మంచి సంబంధాలు ఉండేవని గుర్తు చేసుకున్నారు.

రమణ మృతి సీపీఐకి తీరని లోటు: బీకే పార్థసారథి, ఎంపీ

పెనుకొండ: ఉమ్మడి అనంతపురం జిల్లా సీపీఐ సీనియర్ నాయకులు ఎంవీ రమణ మృతి ఆ పార్టీకి తీరనిలోటని ఎంపీ బీకే పార్థసారథి గురువారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. విద్యార్థి దశ నుంచే ఎన్నో ప్రజా పోరాటలలో రమణ భాగస్వామి అయ్యాడన్నారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా మొక్కువోని ధైర్యంతో పార్టీ ఉన్నతికి కృషి చేశారన్నారు. ఆయన మృతి అనంతపురం జిల్లా కమ్యూనిస్ట్ పార్టీకి తీరనిలోటన్నారు.



ఎంవీ రమణ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న పరిటాల శ్రీరామ్

ఏంటి ఇదంతా..?

సాయిరత్న ఆస్పత్రి వ్యవహారంపై కలెక్టరు ఆగ్రహం

బాధితుడికి రూ.80 వేలు ఇప్పించండి

వైద్యాధికారుల సమీక్షలో కలెక్టరు వినోద్ కుమార్

అనంతపురం టౌన్, ఆగస్టు 8: ఆరోగ్యశ్రీ పథకం కింద ఆపరేషన్ సక్రమంగా చేయలేదని వచ్చిన ఫిర్యాదుపై కలెక్టరు వినోద్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితుడికి ఆస్పత్రి యాజమాన్యం నుంచి రూ.80 వేలు ఇప్పించాలని, అతడు కోలుకునే వరకు అదే ఆస్పత్రిలో ఉచితంగా ఫిజియోథెరపీ చేయించాలని ఆదేశించారు. గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన చిదంబరయ్య చేతికి నగరంలోని సాయినగర్‌లో ఉన్న సాయిరత్న ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పథకం కింద ఆపరేషన్ చేయించారు. ఆరోగ్యశ్రీద్వారా ఆస్పత్రి వారు డబ్బులు పొందారు. అయితే ఆపరేషన్ సక్రమంగా చేయకపోవడం వల్ల రాడ్ బయటకు వచ్చి మరింత ఇబ్బంది పడుతున్నామని బాధితులు చిదంబరయ్య, అతడి భార్య వరలక్ష్మి కలెక్టరు, ఆరోగ్యశ్రీ, వైద్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని గురువారం జరిగిన ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కమిటీ సమీక్షలో చర్చించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎవరికైనా ఎన్టీఆర్ వైద్యఆరోగ్యశ్రీకి సంబంధించి సమస్యలు ఉంటే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 08554- 247266 ఫోన్ నెంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈసెంటర్ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంచాలని, వచ్చిన ప్రతి ఫిర్యాదును నమోదు చేసుకొని, విచారణచేసి, పరిష్కరించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కింద లబ్ధిదారులను నమోదు చేయాలన్నారు. సమీక్షలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ.బీదేవి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు లక్ష్మణరావు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు వినోద్ కుమార్

కొత్త క్రిమినల్ చట్టాలను ఉపసంహరించుకోవాలి

అనంతపురం క్రైం, ఆగస్టు 8: కొత్త క్రిమినల్ చట్టాలను ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ (ఐలు) జిల్లా కమిటీ గురువారం జిల్లా కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేసింది. బార్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఐలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈరామసప్ప, సతీష్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి కొత్త క్రిమినల్ చట్టాలను అమలు చేస్తోందన్నారు. కొత్త చట్టాలపై న్యాయవాదులు, ప్రజలు, మేధావులతోనూ, పార్లమెంటు లోనూ చర్చలు జరపలేదన్నారు. పార్లమెంటులో బిల్లును ఆమోదించే సమయంలో ప్రతిపక్షాలకు చెందిన 146 మంది ఎంపీలను సస్పెండ్ చేశారన్నారు. ఇవి పౌర హక్కులు, వ్యక్తి స్వేచ్ఛకు రక్షణ లేని చట్టాలన్నారు. పోలీసులకు ఎక్కువ అధికారాలు ఇచ్చారన్నారు. రిమాండ్ కాలం 15రోజులు లోపు పోలీస్ కస్టడీకి అడిగే విధానాన్ని 60 నుంచి 90 రోజులకు పెంచారన్నారు. కొత్త చట్టాలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. కార్యక్రమంలో సూర్యచంద్ర, ప్రకాష్, పురుషోత్తం, నాగరాజు, సురేష్, అశోక్‌నాయక్, ధర్మేంద్ర, చంద్రశేఖర్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

చీనీ కాయలు టన్ను రూ.20వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 8: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20 వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.15వేలుతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు 506 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

947 మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా

అనంతపురం అర్బన్, ఆగస్టు 8: జిల్లాకు 947 మెట్రిక్ టన్నుల ఎరువులు గురువారం సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ రవి పేర్కొన్నారు. ఇందులో యూరియా 338 మెట్రిక్ టన్నులు, డీఏపీ 379, 20-20-0-13 రకం ఎరువులు 230 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయ్యాయన్నారు.

డీఎస్పీల బదిలీ

అనంతపురం క్రైం, ఆగస్టు 8: ఉమ్మడి జిల్లా పరిధిలో పలువురు డీఎస్పీల బదిలీలు జరిగాయి. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డిని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. కళ్యాణదుర్గం డీఎస్పీగా ఇంటెలిజెన్స్‌లో పనిచేస్తున్న పి.రవిబాబును నియమించారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం డీఎస్పీగా గుంటూరు వెస్ట్‌లో పనిచేస్తున్న కేవీ మహేష్‌ను నియమించారు.

పీడీఎస్ బియ్యంతో పట్టుబడేవారిపై పీడీ యాక్ట్

విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య



అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 8: పీడీఎస్ బియ్యంతో పట్టుబడితే పీడీ యాక్ట్ అమలు చేస్తామని విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య హెచ్చరించారు. గురువారం కార్యాలయంలోని తన చాంబర్‌లో పీడీఎస్ బియ్యం దుర్వినియోగానికి సంబంధించి పలు విషయాలను ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కిలో రూ.45 కొని సూక్ష్మ పోషకాలు ఇమిడి ఉన్న బియ్యాన్ని పేద వారికి చౌకధరల దుకాణాల ద్వారా అందిస్తోందన్నారు. అయితే చాలా మంది రేషన్‌కార్డుదారులు ఆ బియ్యాన్ని కిలో రూ.10కు అమ్ముకుంటూ ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారన్నారు. పీడీఎస్ బియ్యం క్రయ,విక్రయాలపై నిఘా పెట్టి దాడులు చేస్తామన్నారు. గత ఏడాది నవంబరులో జిల్లాలోని తాడిపత్రితో పాటు పలు ప్రాంతాల్లో పీడీఎస్ బియ్యం గోడౌన్‌ల తనిఖీల్లో భాగంగా జరిగిన అక్రమాలకు సంబంధించి రూ.ఐదు కోట్లు జరిమానా విధించినట్లు వెల్లడించారు.

నేడు పీసీసీఎఫ్ రాక

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు8: ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) చిరంజీవి చౌదరి శుక్రవారం జిల్లా పర్యటనకు రానున్నట్లు తెలిసింది. జిల్లా కేంద్రానికి గురువారం రాత్రికి చేరుకుని బస చేయనున్నారు. ఉదయం 7 గంటలకు జిల్లా అటవీశాఖ కార్యాలయాన్ని తనిఖీ చేయనున్నారు. అనంతరం వడ్డుపల్లి బీట్‌లోని పంపనూరు నగరవనంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమానికి హాజరు కానున్నారు. తర్వాత కళ్యాణదుర్గం, రాయదుర్గంలలో ఏర్పాటు చేయనున్న నగరవనాలను పరిశీలించనున్నారు.

తుంగభద్రకు తగ్గిన వరద

బొమ్మనహాళ్, ఆగస్టు 8: తుంగభద్ర జలాశయానికి వచ్చే వరద నీరు తగ్గుముఖం పట్టింది. గురువారం సాయంత్రానికి 48,239 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఒక్క అడుగు మేర 5 క్రస్ట్ గేట్లు ఎత్తి నది, కాలువలకు కలిపి మొత్తం 12,545 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నారు. 1633 అడుగులతో 105 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో గురువారం సాయంత్రం నాటికి 1632.53 అడుగులతో 103.900 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. హెచ్చెల్సీ బొమ్మనహాళ్ సరిహద్దులోని 105వ కి.మీ. వద్ద 1410 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

సీటెలా 'గురూ'..!

గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి తీవ్ర పోటీ

సీట్లు వందల్లో... దరఖాస్తులు వేలల్లో..

ప్రతిభ గల విద్యార్థులకు తప్పని నిరాశ

స్కూళ్లను పెంచితేనే సమస్యకు పరిష్కారం

తక్కువ సీట్లు... ఎక్కువ దరఖాస్తులు

గురుకుల విద్యాలయాల్లో సీట్లు పెంచితేనే పేద విద్యార్థులందరికీ న్యాయం జరుగుతుందని వారి తల్లిదండ్రులు అభిప్రాయ పడుతున్నారు. సాధారణంగా గురుకుల పాఠశాలల్లో చక్కని బోధన, మంచి భోజనం, వసతి ఉండటంతో తమ పిల్లలను ఇక్కడ చేర్చడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపుతారు. అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందల్లో సీట్లు ఉంటే దరఖాస్తులు వేలల్లో వస్తున్నాయి. ప్రతిభ ఆధారంగానే సీట్ల భర్తీ చేస్తున్నప్పటికీ మరికొందరు ప్రతిభావంతులకు నిరాశ తప్పడం లేదు. ఈక్రమంలోనే సీటు కోసం సిఫార్సులు సైతం వెల్లువెత్తుతున్నాయి. అందుకే ఆయా పాఠశాల స్థాయిని బట్టి సీట్ల సంఖ్యను పెంచాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

- అనంతపురం ప్రెస్‌క్లబ్



నార్పలలోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాల

ఈ ఏడాది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి సంబంధించి వందల సంఖ్యలో ఖాళీలు ఏర్పడితే రూ.20వేలకు పైగా దరఖాస్తు లు వచ్చినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో 15 మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల(బీసీ రెసిడెన్షియల్స్) పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఐదో తరగతిలో ప్రవేశానికి ఈ ఏడాది 960 సీట్లు ఖాళీలున్నాయి. అధికారులు ఈ సీట్ల కోసం 15 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. వీటిలో మెరిట్ ఆధారంగా 960 సీట్లను భర్తీ చేశారు. దాదాపు ఏడు వేల మందికి పైగా మెరిట్ విద్యార్థులకు నిరాశే మిగిలింది. అంబేడ్కర్ గురుకులా(ఎస్సీ రెసిడెన్షియల్స్)ల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఈ ఏడాది 1200 సీట్లు ఖాళీలుండగా...10,600 దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. ఇందులో దాదాపు ఐదు వేల మందికిపైగా మెరిట్ విద్యార్థులు ఉన్నట్లు సమాచా రం. వీరందరికి సీటు దక్కలేదు. గిరిజన గురుకులా(ఎస్టీ రెసిడెన్షియల్స్)ల్లో 801 సీట్లు ఖాళీ ఉండగా దాదాపు 2 వేలకుపైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. ఇక్కడ కూడా 1000 మందికిపైగా విద్యార్థులు సీట్లు పొందలేని దుస్థితి. మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ జిల్లాలో ఒక్కటే ఉంది. ఇందులో ఈ ఏడాది 80 సీట్లు ఖాళీలుండగా... 570 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి ఏడాది వేల సంఖ్యలో విద్యార్థులు గురుకులాల్లో సీట్లు దక్కక ఇబ్బంది పడుతున్నారు.

సీఎం దృష్టికి సమస్య

జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాల్లో నెలకొన్న సీట్ల సమస్య గురించి జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వివరించారు. తాజాగా జరిగిన కలెక్టర్ల సమావేశంలో ఈ సమస్యను సీఎంకు వివరించారు. 'ఎక్కడెక్కడ డిమాండ్ ఉందో అక్కడ సీట్లు ఖాళీలుంటే భర్తీ చేయాలని, లోకల్‌గా వేరే కేటగిరీవారున్నా సీట్లను కేటాయించండి. ఎక్కడా సమస్య లేకుండా చూడాలి' అని సీఎం ఆదేశించినట్లు సమాచారం.

స్కూళ్లను పెంచాలి



ప్రతి గురుకుల పాఠశాలకు దాని సామర్థ్యాన్ని బట్టి విద్యార్థులను కేటాయిస్తారు. ప్రతి ఏడాది ఐదో తరగతి ప్రవేశాలకు ప్రతి పాఠశాలలో 40 నుంచి 80 సీట్లు మాత్రమే ఖాళీలుంటున్నాయి. వీటికోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. 80 మం దికి మాత్రమే సీట్లు కేటాయిస్తే... మిగతా విద్యార్థుల పరిస్థితి ఏంటి..? అసలే కరువు జిల్లాలో పేద కుటుంబాలు చాలా ఉన్నాయి. అలాంటి విద్యార్థులకు గురుకుల పాఠశాల విద్య అందని ద్రాక్షగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు మరో 10 పాఠశాలలను కేటాయిస్తే... ఈ సమస్య తీరుతుంది.

- మధుప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎస్సీ,ఎస్టీ ఐక్యవేదిక

పేద విద్యార్థులకు న్యాయం చేయాలి



ప్రతి సంవత్సరం పదుల సంఖ్యలోనే ఖాళీలు ఏర్పడుతుండటంతో అనేక మంది విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో అదనంగా బీసీ గురుకులాలు 10, ఎస్సీ గురుకులాలు 07, గిరిజన గురుకులాలు 05, మైనార్టీ 04 చొప్పున పాఠశాలలను ఏర్పాటు చేస్తే సమస్య తీరుతుంది. ఇదే సమస్యపై జిల్లా కలెక్టర్‌కు ఇప్పటికే వినతిపత్రాలు సమర్పించాం. తొందరగా జిల్లాలో పాఠశాలల ఏర్పాటుకు కృషి చేసి విద్యార్థులకు న్యాయం చేయాలి.

- మద్దెలచెరువు వెంకీ, అప్సా అధ్యక్షుడు, శ్రీ సత్యసాయి జిల్లా


బోరు వేయిస్తున్న టీడీపీ నాయకులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాగునీటి సమస్య పరిష్కారం

ధర్మవరం రూరల్, ఆగస్టు 8: మండలంలోని నడిమిగడ్డపల్లి తూర్పుతండా, దర్శినమల గ్రామాల్లో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఈ నెల 5న తండాలో తాగునీటికి కటకట, అవస్థలు పడుతున్న గ్రామస్థులు అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన పరిటాల శ్రీరామ్ వెంటనే మండల టీడీపీ నాయకుల ద్వారా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి గ్రామాల్లో తాగునీటి సమస్య తీర్చాలని సూచించారు. స్పందించిన అధికారులు గురువారం నడిమిగడ్డపల్లి తూర్పుతండా, దర్శినమల గ్రామాల్లో తాగునీటి బోరు వేయించగా పుష్కలంగా నీరు పడ్డాయి. దీంతో ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఆ గ్రామస్థులు పరిటాల శ్రీరామ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జంగం నరసింహులు, రామానాయుడు, ధనుంజయ, సుబ్బయ్య పాల్గొన్నారు.

వ్యవసాయ మోటారు చోరీ

పైపులనూ ధ్వంసం చేసిన దుండుగులు


ధ్వంసమైన బోరుబావిని పరిశీలిస్తున్న ఎస్ఐ

ధర్మవరం రూరల్, ఆగస్టు 8 : మండలంలోని చిగిచెర్ల గ్రామ సమీపంలో ఓ తోటలో బుధవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. విద్యుత్ మోటారు, కేబుళ్లు, స్టార్టర్‌పెట్టెను ఎత్తుకెళ్లారు. ధర్మవరం పట్టణానికి చెందిన విజయభాస్కర్‌రెడ్డి 3.75 ఎకరాల్లో చీనీ పంటను సాగుచేస్తున్నాడు. పంటకు నీరు పెట్టేందుకు కొత్తగా విద్యుత్ మోటర్, స్టార్టర్‌పెట్టెను ఏర్పాటు చేశాడు. బుధవారం అర్ధరాత్రి దుండగులు బోరుబావిలో ఉన్న నల్లపైపును బయటకు తీసి.. సుమారు 700 అడు గులలోపు ఉన్న విద్యుత్ మోటర్‌ను, కేబుల్ వైర్లు, స్టార్టర్‌ను ఎత్తుకెళ్లారు. అంతేకాకుండా మోటర్‌కు అమర్చిన పైపులను ధ్వంసం చేశారు. గురువారం ఉదయం తోటకు వెళ్లిన విజయభాస్కర్‌రెడ్డికి చోరీ జరిగినట్లు గుర్తించాడు. రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్ఐ నరేంద్ర సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

వినియోగంలోకి చెత్తసంపద కేంద్రాలు

కదిరి అర్బన్, ఆగస్టు 8: నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువాలని జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొండమనాయునిపాళ్యం, కుమ్మరవాండ్లపల్లి చెత్త సంపద కేంద్రాలను ఆయన పరిశీలించారు. అన్ని గ్రామాల్లో కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. కేంద్రాల చుట్టు పరిశుభ్రంగా ఉంచాలని, క్లాప్ మిత్రుల ద్వారా ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ నిర్వహించాలని అన్నారు. పీఆర్ -1 యాప్ నందు రిజిష్టర్ చేసిన బూష్‌క్లీయరెన్స్, డ్రైనేజీ క్లినింగ్, గార్బెస్‌పాయింట్, లాంటివి ఎప్పటికప్పుడు రిజిష్టర్ చేసి క్లియర్ చేసినట్లు యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆయనతో పాటు డీఎల్‌పీఓ అంజనప్ప, కార్యదర్శులు పద్మజ, శ్రీనివాసులు ఉన్నారు.


కుమ్మరవాండ్లపల్లిలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారి

చెట్ల కింద చదువులు



- 280 మందికి రెండే గదులు
- నాడు - నేడు పనుల్లో జాప్యం
- వానొస్తే పరిస్థితి మరీ ఘోరం
- కుమ్మరవాండ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల దుస్థితి
- ఇబ్బందుల్లో విద్యార్థులు

చెట్టు కింద చదువు కుంటున్న విద్యార్థులు

కదిరి అర్బన్ : పట్టణానికి సమీపం... కుమ్మర వాండ్లపల్లి మేజర్ పంచాయతీలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తగినన్ని తరగతి గదులు లేవు. ఈ పాఠశాలలో మొత్తం 280 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో మొత్తం మూడు తర గతి గదులు ఉండగా.. ఒక గదిని కార్యాలయానికి వినియోగించుకొంటుండగా.. మిగిలిన రెండు గదులను తరగతులుగా వినియోగిస్తున్నారు. చాలీచాలని గదుల్లో ఇరుకు... ఇరుకుగా కూర్చుంటున్నారు. మిగిలిన విద్యా ర్థులకు చెట్ల కింద, వరండాలో తరగతులు నిర్వహిం చాల్సిన దుస్థితి నెలకుంది. అన్ని తరగతుల విద్యార్థుల ను పక్కన... పక్కన.. కూర్చొబెట్టి తరగతులు నిర్వహి స్తుండటంతో గందరగోళం నెలకుంది. ఎవరు చదువుతు న్నారో.. ఎవరు చదువుకోవడం లేదో అర్థం కాక ఉపాధ్యాయులు తలలు ఇబ్బందులు పడుతున్నారు.

నాడు - నేడు పనుల్లో జాప్యం

కుమ్మరవాండ్లపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలను 2017లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఆరు నుంచి 10వ తరగతి వరకు 280 మంది విద్యార్థులు ఉన్నారు. ఇంతమంది విద్యార్థులకు కేవలం రెండు గదులే ఉన్నాయి. 2022లో ఈ పాఠశాలకు నాడు-నేడు రెండో విడత కింద రూ.కోటి 80 లక్షల నిధులు కేటాయించారు. గ్రామంలోని సచివాలయం వద్ద నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే ప్రభుత్వం నుంచి నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో పనులు మందకొడిగా సాగాయి.

వర్షం పడితే ఇక్కట్లే

ఇక వర్షం వస్తే ఆ రోజు ఉపాధ్యాయులు, విద్యార్థుల బాధలు వర్ణనాతీతం. ఆ సమయంలో చెట్టు కింద, వరండాల్లో చదివే విద్యార్థులంతా ఆ రెండు గదుల్లోనే ఇరుక్కొని ఉండాల్సి వస్తోంది. దీనికి తోడు పాఠశాల కన్న వీధిరోడు ఎత్తుగా ఉండడంతో వర్షం నీరంతా పాఠశాలలోకి చేరుతుంటుంది. దీంతో మోకాళ్లలోతు వరకు నీరు నిలుస్తుంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం: హెచ్‌ఎం రాజగోపాల్‌రెడ్డి

ప్రస్తుత పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నాడు-నేడు కింద ఇంకా రూ.40 లక్షలు రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఆ నిధులు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఆ నిధులు విడుదల కాగానే త్వరగా భవన నిర్మాణాలు పూర్తి చేసి, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం.

చదువుకోవడం ఇబ్బందిగా ఉంది



ఇరుకు గదుల్లో చదువుపై దృష్టిసారించలేక పోతున్నాం. పక్క తరగతిలో చెబుతున్న పాఠ్యాంశాలు మాకు వినిపిస్తున్నాయి. దీంతో మేం చదువుకోవడానికి ఇబ్బంది పడుతున్నాం. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠ్యాంశాలపై దృష్టిరించలేకపోతున్నాం.

- పరమేష్ నాయక్, 10వ తరగతి విద్యార్థి

త్వరగా భవనాన్ని పూర్తి చేయండి



కొత్త భవనాన్ని త్వరగా నిర్మిస్తే మేలు. ఇక్కడి పరిస్థితుల్లో చదువుకో వడానికి చాలా ఇబ్బంది పడుతున్నాం. ఉపాధ్యా యులు చెబుతున్న పాఠాలను శ్రద్ధగా వినలేకపోతున్నాం. వర్షం వస్తే కనీసం పుస్తకాలు తడవకుండా పెట్టుకోవడానికి కూడా స్థలం ఉండదు.

-హేమ, 10వ తరగతి విద్యార్థిని



వరండాలో చదువుకుంటున్న విద్యార్థులు


నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనం

హైస్కూల్ ప్లస్ చేశారంతే..

- మౌలిక వసతులు మరచిన గత వైసీపీ సర్కార్
- హైస్కూల్ ఉపాధ్యాయులతో ఇంటర్ బోధన
- పరీక్షలు తప్పిన విద్యార్థులు
- రెండో విడతలో 8 హైస్కూళ్లు ఎంపిక
- చేరేందుకు ఆసక్తి చూపని విద్యార్థులు



కొత్తచెరువులోని హైస్కూల్ ప్లస్ కళాశాల

కొత్తచెరువు: 'విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకువస్తాం... 3,4,5 తరగతి విద్యార్థులకు హైస్కూల్‌లో విలీనం చేసి సబ్జెక్టు ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తాం.... పదో తరగతి బాలికల పాఠశాలలోనే హైస్కూల్ ప్లస్ (బాలికల జూనియర్ కళాశాల)ను ఏర్పాటు చేసి ఆ పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు బయ టకు వెళ్లకుండా ఆ పాఠశాలలోనే ఇంటర్ అభ్యసించేలా చేస్తాం'.. అని మాజీ సీఎం జగన్ గొప్పలు చెప్పారు. అయి తే ఆచరణలో పాలకులు నిర్లక్ష్యం చూపడంతో అది నీరుగా రిపోయింది. హైస్కూల్‌ల్లో విద్యార్థులు సరిపడా తరగతులు లేక సతమతమవుతుంటే.. వాటిలో ఇంటర్ తరగతులను కూడా నిర్వహిస్తుండటంతో సమస్యలు వేధిస్తున్నాయి. మరో వైపు చాలా కళాశాలలో అధ్యాపకుల కొరత ఉంది. మరోవైపు పూర్తిస్థాయిలో పుస్తకాలు కూడా గత ప్రభుత్వం అందించలేకపోయింది. వీటిల్లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో మాత్రమే అడ్మిషన్లకు అవకాశం కల్పించడంతో అనేక మంది విద్యార్థులు ప్రైవేటు కళాశాలల్లో చేరుతున్నారు.

ఆసక్తి చూపని విద్యార్థులు: శ్రీసత్యసాయి జిల్లాలో మొదటి విడత కింద కొత్తచెరువులోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 2022-23లో హై స్కూల్ ప్లస్‌ను ఏర్పాటు చేశారు. కొత్తచెరువులోని హైస్కూల్‌లో గత ఏడాది 10వ తరగతి 30 మంది పాసయ్యారు. అయితే వారిలో కేవలం 13 మంది మాత్రమే హైస్కూల్ ప్లస్‌లో చేరారు. పెనుకొండలోని హైస్కూల్‌లో గత ఏడాది 10వ తరగతి 45 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా.. వారిలో కేవలం 10 మంది మాత్రమే హైస్కూల్ ప్లస్‌లో చేరారు. జిల్లాలో హైస్కూల్ ప్లస్ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి కొత్తచెరువు మండలంలో 27 మంది, పెనుకొండ మండలంలో 54 మంది మాత్రమే చేరారు. ఇక ఈ ఏడాది కొత్తగా ఏర్పడిన 8 హైస్కూల్ ప్లస్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ కలిపి బత్తలపల్లిలో 10 మంది, ఓబుళదేవరచెరువులో 10 మంది, రోళ్లలో 10 మంది, బుక్కపట్నంలో ఒకరు చేశారు. గాండ్ల పెంట, గోరంట్ల, సోమందెపల్లి, ఎన్‌పీకుంటలోని హైస్కూ ల్ ప్లస్‌లో ఒక్కకు కూడా చేరలేదు. మొత్తం కళాశాలలో 122 మంది చదు వుతున్నట్టు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో కొందరు చేరుతు న్నప్పటికి చాలామంది రెండో సంవత్సరం వచ్చేసరికి ఇతర కళాశాలలకు మారుతున్నారు. ఇలా ప్రస్తుతం దాదాపు 60 మంది మాత్రమే చదువు తున్నట్టు సమాచారం.

తగ్గిన ఉత్తీర్ణత : హైస్కూల్ ప్లస్‌లో మొదటి సంవత్సరం పూర్తి చేసి రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడానికి ల్యాబ్‌లు కూడా లేవు. కనీసం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు చదువుకోవడానికి తరగతి గదులు కూడా లేవు. హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు హైస్కూల్ ఉపాధ్యాయులతో బోధన నెట్టుకొచ్చారు. దాని ఫలితంగా ప్రస్తుత ఇంటర్ ఫలితాల్లో మొత్తం విద్యార్థులు పరీక్షలు తప్పారు. సప్లమెంటరీ పరీక్షలలో కొత్తచెరువులో 9 మంది బైపీసీ విద్యార్థులకు గాను ఇద్దరు, ఎంపీసీ గ్రూపులో నలుగురు విద్యార్థులకు గాను ఇద్దరు ఉత్తీర్ణులయ్యారు. ఇలా ఉత్తీర్ణత దారుణంగా పడిపోయింది. చాలా మంది విద్యార్థులు పెయిల్ అయ్యారు.

నరక ప్రయాణం


వసంతపురం మీదుగా చింతలపల్లికి వెళ్లే రహదారి దుస్థితి

ధర్మవరం రూరల్, ఆగస్టు 8: మండలంలోని చింతలపల్లి, వసంతపురం రహదారి పూర్తిగా దెబ్బతింది. కంకర తేలి ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ గ్రామాల నుంచి ప్రతి రోజు ధర్మవరానికి ఆటోలు, ద్విచక్రవాహనాల్లో గ్రామస్థులకు వచ్చి.. వెళ్తుంటారు. సుమారు ఐదు కిలోమీటర్ల మేర ఇలా రోడ్డంతా కంకరతేలి.. గుంతలమయమై ఉండటంతో.. ఆ గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి.. ఈ రోడ్డు బాగు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నకిలీ డాక్టర్ అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 8: తిరుపతి రుయా స్పత్రిలో డాక్టర్ అని చెప్పి రోగుల సహాయకులను మోసం చేస్తున్న వ్యక్తిని గురువారం వెస్ట్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ బాలకృష్ణ కథనం మేరకు...సత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం నరసంపల్లి తాండాకు చెందిన బనావత్ సాయికుమార్ తిరుపతిలో వుంటున్నాడు.నగదు, మొబైల్ ఫోన్లు కొట్టేయ డంలో దిట్ట. మదనపల్లెకు చెందిన అశోక్ తన కుమార్తె దీపికను చికిత్స నిమిత్తం ఇటీవల రుయాస్పత్రికి తీసుకొచ్చాడు. బనావత్ సాయికుమార్ తెల్లకోటు వేసుకుని, స్టెతస్కోపుతో డాక్టర్ అని చెప్పి అశోక్‌ను నమ్మించాడు.అతని వద్ద వున్న మొబైల్ ఫోన్ తీసుకోవడంతో పాటు బ్యాంకు ఖాతా నుంచి రూ 40,000 డ్రా చేశాడు. మోసపోయినట్లు గ్రహించాక అశోక్ తిరుపతి వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం తిరుపతి- చెర్లోపల్లి రోడ్డులోని గరుడ సర్కిల్ వద్ద వుండగా సాయికుమార్‌ను అరెస్టు చేసారు. అతని వద్ద నుంచి మొబైల్ ఫోను, రూ 35,000 స్వాధీనం చేసుకున్నారు.

పాలపాటిదిన్నెకు ప్రత్యేక బస్సులు

కదిరి అర్బన్, ఆగస్టు 8: శ్రావణమాసం సందర్భంగా నల్లచెరువు మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామిని దర్శించుకోవడానికి కదిరి ఆర్టీసీ డిపో నుంచి ప్రతి శనివారం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ మైనోద్దీన్ తెలిపారు. కదిరి నుంచి శనివారం ఉదయం నుంచి ప్రతి 30 నిమిషాలకు ఒక బస్సు, అన్నమయ్య జిల్లాలోని ములకలచెరువు నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలకు మైక్ సెట్ వితరణ

నల్లమాడ, ఆగస్టు 8: మండలంలోని రెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు బాపనకుంటకు చెందిన ఎ. ప్రసాద్‌రెడ్డి గురువారం రూ. 15 వేల విలువైన మైక్ సెట్‌ను అందజేశారు. దాన్ని ప్రధానోపాధ్యాయులు జమిపీర్‌కు అందించారు. తన వదిన భారతి జ్ఞాపకార్థం ఈ మైక్‌సెంట్‌ను అందించానని ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ఈక్రాప్ నమోదు చేసుకోండి

కొత్తచెరువు, ఆగస్టు 8: ఖరీఫ్‌లో పంటను సాగుచేసిన రైతులు ఈక్రాప్ బుకింగ్‌ను వచ్చే నెల 15 లోగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి నటరాజు సూచించారు. గురువారం మండలంలోని కొడపగానిపల్లి సమీపంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది చేపట్టిన ఈ క్రాప్ బుకింగ్ నమోదును ఆయన పరిశీలించారు. రైతులు క్రాప్ బుకింగ్ చేసుకోవడం వల్ల ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టపోతే వారికి ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు అందుతాయన్నారు. కావున ప్రతి ఒక్క రైతు క్రాప్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీపీఓ కౌశిక్, రైతులు పాల్గొన్నారు.

డ్రిప్‌లు, స్ప్రింక్లర్ల కోసం...

బత్తలపల్లి, ఆగస్టు 8: బోరు బావుల కింద వ్యవసాయం చేసే రైతులు డ్రిప్‌లు, స్ప్రింక్లర్ల కోసం రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఏపీఎంఐ ఏఓ శివశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఐదు ఎకరాల లోపు భూమి ఉన్నవారికి 90 శాతం, ఐదు ఎకరాలపైన ఉన్నవారికి 70 శాతం సబ్సిడీతో వాటిని ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు 1బి, భూమి స్కచ్, చెక్ బంది సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్ బుక్, బోరుబావి కరెంటు బిల్లు తీసుకొని రైతు సేవా కేంద్రంలో పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు.

గర్భకోశ చికిత్స శిబిరం

బత్తలపల్లి ఆగస్టు 8 : మండలంలోని అప్రాచెరువులో పశువర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి అధికారి సుధాకర్ మాట్లాడుతూ.. 90 శాతం పెయ్య దూడలు పుట్టే విధంగా లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భదారణ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. పశువులు యదకు వచ్చినప్పడు గర్భధారణ సూదులను సబ్సిడీ పోను రూ.500లకు వేస్తామని తెలిపారు. అనంతరం పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ శ్రీనివాసులు, చంద్రశేఖర్, వైద్యాధికారి గురునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

ధర్మవరం రూరల్, ఆగస్టు 8 : ధర్మవరం తహసీల్దార్‌గా నటరాజ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కదిరి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడి తహసీల్దార్ రమేష్ కడపకు బదిలీ అయ్యారు.

గాండ్లపెంట : నూతన తహసీల్దార్‌గా వేణుగోపాల్ బాధ్యతలు స్వీకరించారు. పుట్టపర్తి తహసీల్దార్ అయిన ఆయన్ను ఎన్నికల సమయంలో కడప జిల్లా బద్వేల్ తాలూకా అట్లూరు మండలానికి బదిలీ చేశారు. ఇక్కడి తహసీల్దార్ శ్రావణి అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో వేణుగోపాల్‌ను నియమించారు.


గొట్లూరు పాఠశాల కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్‌తో ఉపాధ్యాయులు


పట్నంలో స్కూల్ కమిటీ నూతన సభ్యులు


కుటాగుళ్ల హైస్కూల్‌లో చైర్మన్‌ను అభినందిస్తున్న ఎంఈఓలు

విద్యాకమిటీలు ఏకగ్రీవం

ధర్మవరం రూరల్, ఆగస్టు 8: ధర్మవరం పట్టణ, మండలంలో పాఠశాల విద్యాకమిటీ ఎన్నికలు గురువారం ఏకగ్రీవంగా ముగిశాయి. పాఠశాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవానికి సహకరించారు. మండలంలో గొట్లూరు పాఠశాలలో చైర్మన్‌గా శ్రీరాములు, ఉప్పునేసినపల్లిలో సంధ్య, గరుడంపల్లిలో ముర ళీ, చిగిచెర్లలో ఆనంద్, ఓబిరెడ్డి, చింతలపల్లిలో క్రిష్ణయ్య.. ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇందులో టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్‌చౌదరి, మాజీ జడ్పీటీసీ మేకల రామాంజినేయులు, కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి విజయసారథి పాల్గొన్నారు.

కదిరి/కదిరి అర్బన్ : పట్టణం, రూరల్ పరిధిలోని 96 ప్రభుత్వ పాఠశాలలో గురువారం స్కూల్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ చెన్నక్రిష్ణ తెలిపారు. పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాల చైర్మన్‌గా రమాదేవి, వైస్ చైర్మన్‌గా అల్తాప్, బాలికల ఉన్నతపాఠశాల చైర్మన్‌గా పి.సుజాత, పట్నం జిల్లాపరిషత్ చైర్మన్‌గా వీరప్రకాష్, వైస్ చైర్మన్‌గా నజీరాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్ల మున్సిపల్ హైస్కూల్ చైర్మన్‌గా పిల్లల గోపాల్, వైస్ చైర్మన్ బండ్లపల్లి లక్ష్మీదేవితోపాటు 13మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

కొత్తచెరువు: మండలంలో 42 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక జిల్లాపరిషత్ బాలుర పాఠశాలకు భాస్కర్, బాలికల పాఠశాలకు దాసరి శ్రీనివాసులు అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగానే సాగాయి. ఎన్నికైన వారికి టీడీపీ నాయకులు మండల, టౌన్ కన్వీనర్లు రామకృష్ణ, ఒలిపి శ్రీనివాసులు, కాంట్రాక్టర్ లక్ష్మి నారాయణ, నాయకులు బండ్లపల్లిరాజు, గాజులచంద్ర, బీడుపల్లి సుబ్బరాయుడు, షర్ఫోద్దీన్, రవి, లింగప్ప శివ, రాధ సన్మానించారు.

ముదిగుబ్బ : మండలంలోని 72 పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ముదిగుబ్బ క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో నిర్వహిం చిన ఎన్నికల్లో చైర్మన్‌గా సూర్యనారాయణ, వైస్ చైర్మన్‌గా నాగూర్‌బీ, బాలుర హైస్కూల్ చైర్మన్‌గా లక్ష్మీదేవి, వైస్ చైర్మన్‌గా రజియా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రమేష్ బాబు, సోమల ప్రకాష్, కోట్ల బాబి, చరణ్, చంద్రసేన, నంద పాల్గొన్నారు.

తాడిమర్రి: మండలంలో నిర్వహించిన ఎస్ఎంసీ ఎన్నికల్లో రెండుస్థానాల మినహా మిగిలిన 34 స్థానాలు ఏకగ్రీవం అయినట్లు ఎంఈఓలు కృష్ణమోహన్, వెంకటేసు తెలిపారు. తాడిమర్రి ఉన్నత పాఠశాల చైర్మన్‌గా బోయక్రిష్ణవేణి, వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిల్ల కొండయ్యపల్లిలో టీడీపీ, బీజేపీ అభ్యర్థులు పోటీపడగా.. టీడీపీ అభ్యర్థి గెలిచాడు. పెద్దకోట్ల పాఠశాలలో వైసీపీ, టీడీపీ అభ్యర్థులు పోటీ పడగా.. వైసీపీ అభ్యర్థి గెలుపొందారు.

బుక్కపట్నం : మండలంలోని 43 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ గోపాల్ నాయక్ తెలిపారు. బుక్కపట్నం బాలికల ఉన్నతపాఠశాల చైర్మన్‌గా పుష్పరమణ, వైస్ చైర్మన్‌గా లక్ష్మీదేవమ్మ, బాలుర పాఠశాల చైర్మన్‌గా నారాణస్వామి, వైస్ చైర్మన్‌గా బ్రాహిణీ, ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా రాజేశ్వరీ, వైస్ చైర్మన్‌గా సునీత, డిపెప్ పాఠశాల చైర్మన్‌గా రాజేశ్వరీ, వైస్ చైర్మన్‌గా దిల్‌షాద్, మహాత్మజ్యోతిరావు పూలే చైర్మన్‌గా భారతిని ఎన్నుకున్నారు.

నంబులపూలకుంట: మండలంలోని స్కూల్‌కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ సుబ్బిరెడ్డి తెలిపారు. నంబుల పూలకుంట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా బాజీజీ, వైస్ చైర్మన్‌గా రమేష్, కస్తూరిబా చైర్మన్‌గా జానకీ, వైస్ చైర్మన్‌గా రెడ్డెప్పరెడ్డిను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు చెప్పారు.

గాండ్లపెంట : మండలంలోని 57 ప్రభుత్వం పాఠశాలలో స్కూల్ కమిటీ ఎన్నికలు గురువారం సజావుగా జరిగినట్లు ఎంఈఓలు క్రిష్ణానా యక్, శ్రీనివాసులు తెలిపారు. గాండ్లపెంట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా రెడ్డినాయక్, వైస్ చైర్మన్‌గా మాబూజాన్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఓబుళదేవరచెరువు : ఓడీసీ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల చైర్మన్‌గా ముద్దులపల్లి శ్రీనివాసులు, వైస్ చైర్మన్‌గా వల్లెపు వెంకటరమణమ్మ, కస్తూరిబా చైర్మన్‌గా భాగ్యమ్మ, వైస్ చైర్మన్‌గా మంగమ్మ ఎన్నికైనట్లు ఎంఇఓలు సురేష్‌బాబు, రమణ తెలిపారు.

నల్లమాడ: మండలంలోని 57 ప్రభుత్వ పాఠశాలలో గురువారం స్కూల్ కమిటీ ఎన్నిక సజావుగా జరిగినట్లు ఎంఇఓలు వేమనారాయణ, సురేష్ బాబు తెలిపారు. నల్లమాడ జిల్లాపరిషత్ పాఠశాల చైర్మన్‌గా లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్‌గా ఎన్ఎస్ నరసింహులు, కస్తూరిబా చైర్మన్‌గా పొరకల నారాయణస్వామి, వైస్ చైర్మన్‌గా అనిత ఏకగ్రీవంగా ఎన్నిక చేశామన్నారు.

అమడగూరు : మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ కమిటీ ఎన్నికలు సజావుగా జరిగినట్లు ఎంఈఓ జిలాన్ బాషా తెలిపారు. 49 పాఠశాలలో ఈ ఎన్నికలు జరిగాయన్నారు.

నల్లచెరువు : నల్లచెరువు జిల్లా పరిషత్ పాఠశాల చైర్మన్‌గా పఠాన్ మోబీనా, వైస్ చైర్మన్‌గా శ్రీనివాసులు, ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా ఓదులపల్లి రియాజ్, వైస్‌చైర్మన్‌గా గంగరత్నమ్మ, మోడల్‌స్కూల్ చైర్మన్‌గా పఠాన్ షరీఫ్ ఖాన్‌ఎంపికైనట్లు ఎంఇఓ తిరుపాల్‌నాయక్ తెలిపారు.

తనకల్లు: మండలంలోని 84 ప్రభుత్వ పాఠశాలలో గురువారం కమిటీ సభ్యులను ఎంపిక చేసినట్లు ఎంఇఓ లలితమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ధరణీబాబు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


కొత్తచెరువులో సభ్యులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు



ముదిగుబ్బలో సభ్యులను సన్మానిస్తున్న కూటమి నాయకులు


బుక్కపట్నం బాలికల ఉన్నత పాఠశాలలో చైర్మన్‌తో టీడీపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



పుట్టవద్ద పూజలు చేస్తున్న మహిళలు

పెనుకొండ, ఆగస్టు 8: నాగుల చవితి పండగను గురువారం పట్టణంలో మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగులపుట్టల్లో పాలుపోసి పూజలు నిర్వహించారు.

మడకశిరలో మోస్తరు వర్షం

మడకశిరటౌన్, ఆగస్టు 8: నియోజకవర్గం వ్యాప్తంగా బుధవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. మడకశిర మండలంలో 16.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అగళిలో 8.4, గుడిబండలో 4.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వర్షం కురవడంతో ఎండుతున్న వేరుశనగ పంటకు జీవం పోసినట్లయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

12న దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

హిందూపురం అర్బన్, ఆగస్టు 8: పట్టణ పరిధిలోని గాంధీ సర్కిల్‌లో నరసింహ స్వామి దేవాలయ నిర్మాణానికి ఈ నెల 12 భూమి పూజచేయనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రాఘవేంద్ర, గౌరవాధ్యక్షుడు జేఈ వెంకటస్వామి పేర్కొన్నారు. అందుకు సంబంధించిన కరపత్రాలను వారు గురువారం కమిటీ సభ్యులతో కలిసివిడుదల చేశారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దంపతుల చేతుల మీదుగా తెల్లవారుజామున 2 గంటలకు భూమి పూజ చేస్తున్నట్లు తెలిపారు. పుర ప్రజలు, హిందువులు, దాతలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ శుభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రఘు, రామాంజినేయులు, నిమ్మకాయల రాము, ఆకుల సూర్యనారాయణ, సుధాకర్ చంద్రమోహన్, నెట్టప్ప, అమర్‌నాథ్, శ్రీకాంత్, ఎస్ఎల్ సూర్య నారాయణ, నవీన్ తదితరులు హాజరయ్యారు.

వైద్యశిబిరం పరిశీలన



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎం హెచ్ఓ సునీల్‌కుమార్

గోరంట్ల, ఆగస్టు 8: పట్టణంలో డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల లక్షణాలు బహిర్గతం కావడంతో వైద్య ఆరోగ్య సిబ్బంది ఏర్పాటు చేసిన శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ సునీల్‌కుమార్ గురువారం పరిశీలించారు. గోరంట్లలోని బాలికల ఉన్నతపాఠశాల వీధిలో వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపును సందర్శించారు. ఏఎన్ఎం మల్లేశ్వరితో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రోగులను పరామర్శించారు. అదేవిధంగా గుమ్మయ్యగారిపల్లిలో డాక్టర్ శ్రుతి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు, విషజ్వరాలపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధుల నివారణకు తీసుకోవాలసిన జాగ్రత్తలను వివరించారు. వైద్య సిబ్బంది రమణ, భాగ్యలక్ష్మి, శాంత, భాస్కర్, చైత్ర, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

చిలమత్తూరు, ఆగస్టు 8: వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం అందుతుందని డాక్టర్ తేజస్విని పేర్కొన్నారు. మండలంలోని టేకులోడు బాలికల గురుకుల పాఠశాలలో గురువారం విద్యార్థి నులకు వైద్యపరీక్షలు నిర్వహించి, వారికి వక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అలాగే దోమల బెడద నుంచి విద్యార్థులను రక్షించేందుకు చర్యలు చేపట్టాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జయచంద్ర, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఘనంగా క్విట్ ఇండియా దినోత్సవం

పెనుకొండ, ఆగస్టు 8 : స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్విట్ ఇండియా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ కేశవరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాటి జాతీయ ఉద్యమంలో నాయకుల త్యాగమే నేటి హక్కులు, బాధ్యతలు అన్నారు. వారి స్ఫూర్తిగా నేటి విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకోవాలని, కళాశాల అభివృద్ధికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, ఎన్ఎస్ఎస్ పీఓ కాంతారావు, ఐక్యూ కోఆర్డినేటర్ యశోదదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఖాళీ కుర్చీలతో మండలసభ



ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న మండలసభ

హిందూపురం(పరిగి), ఆగస్టు 8: ప్రజాసమస్యలను అధికారుల దృష్టికి తెచ్చేందుకు, అభివృద్ధి పనులపై చర్చించేందుకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తారు. అదీ మూడు నెలలకోసారి ఏర్పాటు చేస్తారు. అలాంటి సమావేశాన్ని గురువారం పరిగి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తే... ఎంపీపీ సహా వైసీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరు కాలేదు. వారందరికి ఎంపీడీఓ సుహాసినమ్మ ముందస్తుగా సమాచారం పంపినా ప్రయోజనం లేదు. దీంతో కార్యాలయంలోని సమావేశ హాలులో దాదాపు కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. సభ్యుల గైర్హాజరుతో సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ ప్రకటించారు. కార్యక్రమానికి మండల ప్రత్యేకాధికారి ప్రసాద్‌రావు, అంగనవాడీ సూపర్‌వైజర్ నాగరాణి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు హాజరయ్యారు.

ఇద్దరికి పాముకాటు

గోరంట్ల, ఆగస్టు 8: మండలంలోని రెండు వేర్వేరు చోట్ల వెంకటరమణమ్మ అనే మహిళ, అక్షిత అనే బాలిక పాము కాటుకు గురై గురువారం అస్వస్థత పొందారు. గోరంట్లలోని ఆంజనేయ స్వామి కాలనీకి చెందిన సత్యనారాయణ భార్య వెంకటరమణమ్మ టమోటలు కోయడానికి కూలిగా వెళ్లిన సమయంలో కాలిపై పాము కాటు వేసింది. అలాగే చెట్లమొరంపల్లికి చెందిన నరసింహుడు కుమార్తె నాలుగేళ్ల అక్షిత ఇంటి ఎదుట ఆడుకుటుండగా కట్లపాము కాలిపై కాటు వేసింది. అస్వస్థతకు గురైన వారిరువుని గోరంట్ల ప్రభుతాసుపత్రికి తీసుకురాగా, డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు చేశారు. మెరుగైన చికిత్సల కోసం 108లో పుట్టపర్తి ఆసుపత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

చిలమత్తూరు, ఆగస్టు 8: వెలుగు వీఓఏ బాధ్యతల నుంచి తనను తప్పిస్తారన్న ఆందోళనతో మండల పరిధిలోని చేనేపల్లికి చెందిన సుగుణ అనే మహిళ ఆత్మహత్యకు యత్నించింది. గత ప్రభుత్వంలో పనిచేసిన వీఓఏలను తొలగిస్తారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోందని, ఉద్యోగం నుంచి తప్పుకోవాలని టీడీపీ నాయకులు తనపై ఒత్తిడి తెస్తున్నారని ఆమె ఆరోపించింది. సెల్ఫీ వీడియో తీసుకుంటూ అలంకరణకు ఉపయోగించే రసాయనాన్ని సేవించింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించారు. సుగుణ ఆరోపణలను టీడీపీ నాయకులు ఖండించారు. ప్రభుత్వాలు మారినప్పుడు వీఓఏలను మార్చడం ఆనవాయితీగా వస్తోందని వారు అన్నారు. తనను తీసేస్తారని భావించి ముందుగానే ఆమె తమపై నిందలు వేస్తోందని అన్నారు. ఆమెతో తాము మాట్లాడిందే లేదని, అసత్య ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు.



విద్యాకమిటీ చైర్మన్‌ను అభినందిస్తున్న టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు



పెనుకొండలో ఎంపికైన చైర్మన్, వైస్ చైర్మన్‌తో టీడీపీ నాయకులు



ప్రమాణ స్వీకారం చేస్తున్న హేమావతి పాఠశాల కమిటీ

ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతం

హిందూపురం, ఆగస్టు 8 : పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికల ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలోని మూడు మండలాలతోపాటు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలు సజావుగా జరిగాయి. నియోజకవర్గంలోని హిందూపురం మండలం మలుగూరు, లేపాక్షి మండలం మైదుగోళం పాఠశాల మినహాయించి మొత్తం ప్రక్రియ పూర్తి చేశారు. చైర్మన్, వైస్ చైర్మన్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చిలమత్తూరు మండలంలో 78, లేపాక్షి మండలంలో 58, హిందూపురం మండలంలో 120 పాఠశాలల్లో ఎన్నికలు చేపట్టాగా రెండుచోట్ల మాత్రం నిలుపుదల చేశారు. మిగిలిన అన్నిచోట్ల పూర్తిచేశారు.

టీడీపీ మద్దతుదారులే గెలుపు: నియోజకవర్గంలో గురువారం జరిగిన పాఠశాల మేనేజ్మెంట్ ఎన్నికల్లో చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలను వందశాతం టీడీపీ మద్దతుదారులే గెలుపొం దారు. ఇందులో 80శాతం పాఠశాలల చైర్మన్‌ల ఎన్నిక ఏకగ్రీవమైంది. గెలుపొందిన కమిటీలకు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శుభాకాంక్షలు తెలుపుతూ ఓ ప్రకటన విడుదల చేశారు. గెలుపొందిన విద్యాకమిటీ చైర్మెన్, సభ్యులు పట్టణంలోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని మిఠాయిలు పంచారు. అదేవిధంగా గెలుపొందిన కమిటీలకు ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

హిందూపురం(సోమందేపల్లి): సోమందేపల్లి మండలంలో రెండు చోట్ల మినహా గురువారం చేపట్టిన స్కూల్ యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈదులబళాపురం గ్రామంలో చైర్మన్ పదవికి ఇద్దరు పోటీపడగా టాస్‌వేసి ఒకరిని ఎన్నుకున్నారు. మేకలపల్లిలో రాజకీయ ఒత్తిళ్లతో ఎన్నికలు వాయిదాపడ్డాయి. కార్యక్రమంలో ఎంఈఓ ఆంజనేయులునాయక్, ఎంఈఓ-2 ఆనంద్, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

హిందూపురం(పరిగి): పరిగి మండల వ్యాప్తంగా పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్‌గా అశ్వత్థనారాయణ, వైస్ చైర్మన్‌గా ప్రమీళమ్మను ఎన్నుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు కృపాసత్యరాజ్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. చైర్మన్‌కు బీజేపీ మండల కన్వీనర్ బంగారుచంద్ర, జనసేన పార్టీ మండల కన్వీనర్ సురేష్ అభినందనలు తెలిపారు.

పెనుకొండ రూరల్/పెనుకొండ : మండల వ్యాప్తంగా 49 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. బీసీసంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆదేశాల మేరకు ఎంఈఓలు సుధాకర్, చంద్రశేఖర్ పర్యవేక్షణలో చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుట్టూరు పాఠశాల కమిటీ చైర్మన్‌గా సుబ్బరాయుడు, వైస్ చైర్మన్ సమద్, చంద్రగిరి విశ్వనాథ్, గౌతమి, వెంకటగిరిపాళ్యం జడ్పీహెచ్ఎస్‌కు సుకన్య, గుర్రప్ప, మునిమడుగులో నరసింహులు, హరిజనహరిని ఎన్నుకున్నారు. అలాగే కోనాపురం పాఠశాల చైర్మన్‌గా వడ్డి శ్రీనివాసులు, వైస్ చైర్మన్‌గా శ్రీదేవి, అడదాకులపల్లిలో జి మహేష్‌బాబు, లక్ష్మీబాయిని ఎన్నుకు న్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేశవయ్య, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ గుట్టూరు సూరి, కూటమి స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండలంలోని 101ప్రభుత్వ పాఠశాలల కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంఇఓలు గోపాల్, జాన్ రెడ్డెప్ప పర్యవేక్షణలో చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారిలో గోరంట్ల బాలుర ఉన్నతపాఠశాల చైర్మన్‌గా నరసింహులు, బాలికల ఉన్నతపాఠశాలకు కుమ్మర కళావతి, ఉర్దూ పాఠశాలకు ఆయిషా, పాలసముద్రం కట్టుబడి ఆంజనేయులు, వానవోలు రామాంజనేయులు, మల్లాపల్లి వెంకటనరేష్, బూదిలి మంజుల, మందలపల్లి నాగేంద్ర, పులేరు జయపాల్ ఎన్నిక య్యారు. గిరిజన బాలికల గురుకుల పాఠశాల చైర్మన్‌గా జానకిరామయ్య, ఖజాపురం కేజీబీవీకి అనితమ్మ ఎన్నికైనట్లు అధికారులు తెలిపారు.

చిలమత్తూరు: మండలంలో పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతగా ముగిశాయి. మండలంలో మొత్తం 75 ప్రభుత్వ పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి. ఎంఈఓలు నాగరాజు, సల్మాన్ రాజ్ పర్యవేక్షణలో చైర్మన్, వైస్ చైర్మన్లను ఏకగ్రీవంగా సోమఘట్ట జిల్లా పరిషత్ పాఠశాలలో చైర్మన్‌గా అంజినమ్మ, వైస్ చైర్మన్‌గా శ్రీనాథ్, కోడూరు జడ్పీ పాఠశాలకు మంజుల, నరేష్, చిలమత్తూరు తెలుగు జడ్పీ పాఠశాలకు జగదీష్, జలజను ఎన్నుకున్నారు. అలాగే చిలమత్తూరు జడ్పీ ఉర్దూ పాఠశాలకు బాబజాన్, షమీమ్, కేజీబీవీకి లక్ష్మి, అరుణ, కొడికొండ జడ్పీ పాఠశాలకు షహజాన్, నాగమణి, దేమకేతేపల్లి జిల్లా పరిషత్ పాఠశాల చైర్మన్‌గా శోభ, వైస్ చైర్మన్‌గా నాగేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మడకశిరటౌన్: మడకశిర నగర పంచాయతీ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం చైర్మన్, వైస్‌చైర్మన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఆదిరెడ్డిపాళ్యం ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా నళినాక్షి, వైస్ చైర్మన్‌గా అలివేలమ్మను ఎన్నుకున్నారు. అదేవిధంగా నాగన్న కుంట పాఠశాల చైర్మన్‌గా కవిత, వైస్‌చైర్మన్‌గా అనిత, తొమ్మిదో వార్డు ఎంఆర్ స్కూల్‌కు భారతి, భాగ్యమ్మను ఎన్నుకున్నారు.

మడకశిర రూరల్ : మండలవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకు న్నట్లు మండల విద్యాధికారి భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మొత్తం 119 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. పాఠశాలలకు ఎన్నికైన చైర్మన్లు, వైస్ చైర్మన్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

అగళి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు సజావుగా నిర్వహించారు. మోడల్ పాఠశాలలో జడ్పీటీసీ ఉమేష్‌తోపాటు ప్రిన్సిపాల్ జాఫర్ సమక్షంలో చైర్‌పర్సన్‌గా ఆశ , వైస్ చైర్‌పర్సన్‌గా సరస్వతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జడ్పీటీసీ, ప్రిన్సిపాల్ వారికి డిక్లరేషన్ అందజేశారు. ఆయా పాఠశాలల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు.

గుడిబండ: మండలంలో 55 ప్రాథమిక, రెండు ప్రాథమికోన్నత, 10జడ్పీ ఉన్నత పాఠశాలలకు ఎన్నికలు నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్‌ల ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిమ్మాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో పోటీ ఎక్కువగా ఉండటంతో వాయిదా పడినట్లు ఎంఈఓ గంగప్ప తెలిపారు.

మడకశిర : అమరాపురం మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. చైర్మన్, వైస్ చైర్మన్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీడీపీ మండల కన్వీనర్ గణేష్, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, ఎస్సీ సెల్ నాయకుడు జయకుమార్, టీఎన్‌టీయూసీ రామచంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.



అగళి ఆదర్శ పాఠశాలలో పాల్గొన్న జడ్పీటీసీ ఉమేష్, ప్రిన్సిపాల్



చంద్రగిరిలో ఏకగ్రీవమైన స్కూల్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్

మొక్కజొన్న పంట పరిశీలన



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హిందూపురం అర్బన్, ఆగస్టు 8: మండల పరిధిలోని చలివెందల గ్రామంలో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటను వ్యవసాయాధికారి సురేంద్రనాయక్ గురువారం పరిశీలించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో గురువారం వెలువడిన 'రైతులను ముంచిన నకిలీ' అనే కథనానికి ఆయన స్పందించారు. చలివెందల గ్రామానికి వెళ్లి రైతులతో మాట్లాడారు. పంట పొలాలను పరిశీలించారు. ఎందుకు పంట పండలేదో వారికి వివరించారు. నాగలితో దున్ని పంటను వేయడంతో విత్తనాలు గుంపుగా పడ్డాయని, ఒక దగ్గర ఆరు, ఇంకోచోట ఏడు విత్తనాలు వేశారన్నారు. దీంతో మొలక శాతం తక్కువగా వచ్చిందని తెలిపారు. అదే విధంగా తక్కువ వర్షపాతం ఒక కారణమన్నారు. ఇది విత్తన సమస్య కాదని దుకాణదారుడికి ఎటువంటి భాధ్యత లేదని అంగీకరిస్తున్నట్లు స్టేట్‌మెంట్ రాసి రైతుల వద్ద నుంచి సంతకాలు కూడా తీసుకున్నారు. దీంతో దుకాణదారుడికి అనుకూలంగా స్టేట్‌మెంట్ రికార్డు చేసినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ స్టేట్‌మెంట్‌పై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

ఈ క్రాప్ నమోదు చేసుకోండి: ఏఓ

హిందూపురం(పరిగి), ఆగస్టు 8: పరిగి మండలపరిధిలోని బోరెడ్డిపల్లిలో ఈ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి విజయభారతి తెలిపారు. పంట పెట్టిన ప్రతి రైతు సెప్టెంబరు 15లోగా తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని ఏఓ తెలిపారు. లేకపోతే రైతులకు ప్రభుత్వం అందించే నష్టపరిహారం, ఇన్సూరెన్స్ పథకాలు వర్తించవన్నారు. వ్యవసాయ సిబ్బంది సకాలంలో పంట నమోదు పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ పావని, గ్రామసహాయకులు శివ, శోభ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్: ఖరీఫ్‌లో సాగుచేసిన పంటల వివరాలను రైతులు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి తిమ్మప్ప తెలిపారు. ఈ క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. రైతులు పూర్తిచేసిన పంటల నమోదు దరఖాస్తుతో వెళ్లి సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. రైతులు అందరూ ఈ ఆవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సేవాగుణం అలవరచుకోవాలి

హిందూపురం అర్బన్, ఆగస్టు 8: విద్యార్థి దశ నుంచే సేవాగుణం అలవరచుకోవాలని ఎస్‌డీజీఎస్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాల కార్యదర్శి బైసాని రాంప్రసాద్ పేర్కొన్నారు. గురువారం పట్టణ పరిధిలోని ఎస్‌డీజీఎస్ కళాశాల ఆవరణంలో రెడ్‌క్రాస్ సొసైటీ, సెంట్రల్ జీఎస్టీ డిపార్టుమెంట్, సంయుక్త సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా 63 మంది రక్తదానం చేశారు. డాక్టర్ చరణ్, కార్యక్రమంలో వైద్యాధికారి కౌశిక్, సెంట్రల్ జీఎస్టీ సూపరింటెండెంట్ మహ్మద్‌జీ షాన్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

రొళ్ల, ఆగస్టు 8: మండలం హనుమంతనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త రాజేశ్వరి, ఉపాధ్యాయులు మల్లేష్, శోభ, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యాన్ని వివరించారు.

నేడు గోరంట్లలో మంత్రి పర్యటన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ మండల కన్వీనర్ సోముశేఖర్

గోరంట్ల, ఆగస్టు 8: రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత మండలంలో శుక్రవారం పర్యటించనున్నట్లు టీడీపీ కన్వీనర్ సోముశేఖర్ తెలిపారు. మంత్రి హోదాలో మొదట సారి ఆమె గోరంట్లకు వస్తుండగా కూటమి నాయకులు ప్రధాన రహదారికి ఇరువైపుల ఫ్లెక్సీలతో స్వాగతించడానికి పోటీ పడ్డారు. ఉదయం 10గంటలకు మంత్రి గౌనివారిపల్లిలో ప్రభుత్వం చౌకధాన్యపు దుకాణాన్ని ప్రారంభిస్తారు. అనంతరం 11గంటలకు గోరంట్లలోని ఆంజనేయస్వామి కాలనీలో రూ. పదిలక్షల వ్యయంతో సిసిరోడ్డు, మురుగునీటి కాలువ పనులకు శంకుస్థాపన, అలాగే శివాలయం కాలనీలో రూ.రెండులక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనికి భూమి పూజ నిర్వహిస్తారన్నారు. అనంతరం ఉర్దూ పాఠశాలలో పుస్తకాల పంపిణీలో మంత్రి పాల్గొంటారన్నారు కూటమి నాయకులు ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రభుత్వ స్థలం కబ్జాను

అడ్డుకోవడం నేరమా..?

టీడీపీ నాయకుడు దేమకేతేపల్లి అంజినప్ప

చిలమత్తూరు, ఆగస్టు 8: గ్రామస్థులందరికీ ఉపయోగపడే ప్రభుత్వ స్థలాన్ని వైసీపీ సానుభూతిపరులు దర్జాగా కబ్జా చేస్తుంటే దానిని అడ్డుకోవడం నేరమా అని టీడీపీ నాయకుడు దేమకేతేపల్లి అంజినప్ప ప్రశ్నించారు. ఆయన గురువారం విలేకరల సమావేశంలో మాట్లాడుతూ... తనపై, తన కుటుంబ సభ్యులను వైసీపీ నాయకులు గోపాలప్ప, అతడి కుటుంబ సభ్యులు మూడేళ్లుగా ఇబ్బంది పెడుతున్నార అన్నారు. కానీ గొడవలు మంచివి కావని భావించి తాము పట్టించుకోలేదన్నారు. గ్రామంలోని ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయడానికి వారు ప్రయత్నించగా తమ కుటుంబ సభ్యులు అడ్డుకోబోతే తమపైనే దాడి చేసి గాయాలపాల్జేశారన్నారు. తమ కుటుంబ సభ్యురాలు జయమ్మ తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలైందన్నారు. ఈ ఘటనలో దెబ్బలు తినింది తమ కుటుంబ సభ్యులైతే, దాడి చేసిన వారికి మద్దతుగా జగన్ సొంత పత్రిక తనపై లేని కథనాలు రాస్తోందన్నారు. గొడవ జరిగిన సమయంలో తాను ఇంట్లో లేనని, అయినా తానే గొడవకు పాల్పడి, కొడవలితో తరిమినట్లు అబద్ధాలు రాసిందన్నారు. ఇలాంటి తప్పుడు కథనాలతో టీడీపీ నాయకులను బెదిరించాలని చూస్తే అది భ్రమే అవుతుందన్నారు. ఈ గొడవకు కారణమైన కబ్జా స్థలం ప్రభుత్వానిది కాదని, గోపాలప్పదని నిరూపిస్తే తాను ఏ శిక్షకైనా సిద్ధమన్నారు. పోలీసుల సంఘటనా స్థలానికి వచ్చి విచారణ చేసిన అనంతరమే కేసు నమోదు చేశారని, ఇందులో వారి పక్షపాతం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకొని ప్రజోపయోగాలకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

చౌకధాన్య డిపో ప్రారంభం

పెనుకొండ రూరల్, ఆగస్టు 8: మండలంలోని చంద్రగిరి గ్రామంలో నూతనంగా చౌకధాన్యపు డిపోను టీడీపీ నాయకులు ప్రారంభించారు. బీసీ సంక్షేమం, చేనేతజౌళి శాఖ మంత్రి సవిత చొరవతో ఎఫ్‌పీ షాపు డీలర్‌షిప్‌ను గ్రామానికి చెందిన అరుణ అనే మహిళకు కేటాయించారు. దీంతో గురువారం చంద్రగిరి గ్రామంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షుడు పోతిరెడ్డి, బాబిరెడ్డి, రామక్రిష్ణ, నాగరాజు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి క్షీరాభిషేకం చేసి, ఎఫ్‌పీ షాపును ప్రారంభించారు. రేషన్‌కార్డు లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేశారు.

పాఠశాల కమిటీ ఎన్నిక వాయిదా



పాఠశాలకు తాళం వేసి ఉన్న దృశ్యం

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 8: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల సందర్భంగా గురువారం రాజకీయ ఒత్తిళ్లతో అసహనానికి గురైన ప్రధానోపాధ్యాయుడు ఏకంగా విద్యార్థులను బయటకు పంపి బడికి తాళం వేసుకుని వెళ్లాడు. సోమందేపల్లి మండలంలోని మేకలపల్లి ఉన్నత పాఠశాలలో ఎన్నికలు చేపట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులు మినహా అందరూ బయటికి వెళ్లాలని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు గోవింద నాయక్ తెలిపినట్లు సమాచారం. అప్పటికే అధికార, ప్రతిపక్ష నాయకుల ఒత్తిళ్ల మధ్య చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు సంబంధించి వాతావరణం వేడెక్కి ఉంది. రాజకీయ ఒత్తిళ్లు పెరగడంతో మధ్యాహ్నం 2.30గంటలకు అసహనానికి గురైన హెచ్ఎం లాంగ్‌బెల్ కొట్టి బడికి తాళం వేసి వెళ్లిపోవడంతో ఎన్నిక వాయిదా పడింది. ఈ విషయంపై హెచ్ఎంను వివరణ కోరగా రాజకీయ నాయకుల ఒత్తిళతో అలా చేయాల్సి వచ్చిందన్నారు. ఎంఈఓ రామాంజినేయులునాయక్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. హెచ్ఎంపై విచారించి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఈ పంచాయతీ కాస్త మంత్రివద్దకు చేరినట్లు సమాచారం.

లేపాక్షి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా 58 ప్రభుత్వ పాఠశాలలుండగా 57పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి. మైదుగోళం ప్రభుత్వ పాఠశాలలో కోరం లేకపోవడంతో ఎన్నికలు వాయిదా పడినట్లు ఎంఈఓ నాగరాజునాయక్ తెలిపారు. మిగిలిని 57పాఠశాలల్లోనూ ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. దీంతో తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేసుకున్నారు. మైదుగోళం ఎన్నికలు ఎప్పుడు నిర్వహించేది ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రకటిస్తామని ఎంఈఓ తెలిపారు.

నారా రోహిత్‌కు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కృతజ్ఞతలు



అనంతపురం కల్చరల్, ఆగస్టు 8: సినీ నటుడు నారా రోహిత్‌కు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో రోహిత్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రచార కార్యక్రమంలో హాజరైనందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట రాయల్ మురళి, వెంకటప్ప ఉన్నారు.

'సంఘాలతోనే ఉద్యోగుల భద్రత'

గుడిబండ, ఆగస్టు 8 : సంఘాలతోనే ఉద్యోగులకు భద్రత ఉంటుందని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గోవిందప్ప పాల్గొన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వీఆర్ఓలు, పంచాయతీ కార్యదర్శులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు సంఘాల్లో పేర్లునమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం ఉద్యోగుల సమస్యలనుతెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాంభూపాల్‌రెడ్డి, నాయకులు శివరాజ్, బూచేగౌడ్, రాంప్రసాద్, ఈఓఆర్డీ నాగరాజునాయక్, పంచాయతీ కార్యదర్శి ప్రకాశ్ పాల్గొన్నారు.

డెంటల్ ల్యాబ్‌ను తెరవండి

రాజకీయ పార్టీల ఐక్యవేదిక వినతి

హిందూపురం అర్బన్, ఆగస్టు 8: రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా హిందూపురం ప్రభుత్వా సుపత్రిలో డెంటల్ ల్యాబ్ సౌకర్యం ఉందని రాజకీయ పార్టీల ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. అయితే ఏడాదిన్నర నుంచి దానిని మూసివేయడం బాధాకరమన్నారు. వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని కోరుతూ గురువారం ప్రభుతాసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. అనంతరం సూపరింటెండెంట్ రోహిల్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దంతాల చికిత్సతో పాటు కట్టుడు దంతాలు సిద్ధం చేసే అవకాశం ఈ ఆసుపత్రిలోని ల్యాబ్‌లో ఉందన్నారు. ప్రభుత్వాసుపత్రికి వచ్చే పేదలు ఇక్కడ సౌకర్యం లేకపోవడంతో అప్పులు చేసి బయట తయారు చేయించుకుంటున్నా రన్నారు. కట్టుడు దంతాలను ప్రైవేట్ ఆసుపత్రిలో తయారు చేయించాలంటే దాదాపు రూ. 25వేల వరకు అవుతుందన్నారు. వెంటనే డెంటల్ ల్యాబ్‌ను తెరిచి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. బీఎస్పీ నాయకుడు శ్రీరాములు, ఆర్ఎస్‌పీ శ్రీనివాసులు, ఎంఐఎం మున్నా, ఏపీఆర్ఎస్ నౌషద్, కలీం, నారాయణ, మద్దిలేటి, సుబ్బన్న, కిష్టప్ప ఉన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కంటెయినర్

● ఒకరి దుర్మరణం



లక్ష్మీనారాయణ (ఫైల్)

పెనుకొండ రూరల్, ఆగస్టు 8: మండలంలోని కియ పరిశ్రమ ఎదురుగా గురువారం ద్విచక్రవాహనాన్ని కంటెయినర్ ఢీకొన్న ప్రమాదంలో లక్ష్మీనారాయణ(35) దుర్మరణం చెందినట్లు కియ ఎస్ఐ రంగడు తెలిపారు. రామగిరి మండలం పెనుబోలు గ్రామానికి చెందిన జూటూరు లక్ష్మీనారాయణ కొన్నేళ్ల నుంచి ధర్మవరంలోని హెచ్‌పీ గ్యాస్ గోడౌన్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. అతడు గురువారం ఉదయం ధర్మవరం నుంచి పెనుకొండకు పనినిమిత్తం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కియ పరిశ్రమ ఎదురుగా మెయిన్ గేట్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న కంటెయినర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి ఎడమ నుంచి కుడివైపునకు వెళ్లాడు ప్రమాదవశాత్తు వాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. వెనుకే వస్తున్న కంటెయినర్ వాహనం అతడి తలపై దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మీనారాయణమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇంటిపెద్దదిక్కు కోల్పోవడంతో బోరున విలపించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.